
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి
జిల్లా వార్తలు

శనివారం 19 ఏప్రిల్ 2025

వరుస చోరీలతో జనం బెంబేలు

ఎలమంచిలిలో పెరిగిన దొంగతనాలు

- ఒంటరిగా ఉన్న మహిళలే లక్ష్యంగా చైన్ స్నాచింగ్
- పట్టపగలే బంగారు ఆభరణాలు తెంచుకుని పరారీ



ఎలమంచిలి పట్టణ పోలీస్ స్టేషన్

ఎలమంచిలి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):

పట్టణంలో చైన్‌స్నాచింగ్ నేరాలు పెరిగిపోతున్నాయి. ఒంటరిగా ఉన్న మహిళలే లక్ష్యంగా చోరులు రెచ్చిపోతున్నారు. పట్టపగలు ఆడవారి మెడల్లో నుంచి బంగారం గొలుసులు తెంచుకుని పారిపోతున్నారు. నెల రోజుల వ్యవధిలో మూడుచోట్ల చైన్ స్నాచింగ్ జరిగింది. దీంతో పట్టణ ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.

ఎలమంచిలిలో టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్‌లు వున్నాయి. వీటిల్లో అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో ఉన్నారు. పట్టణంలో పలుకీలక ప్రదేశాల్లో పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇవి కాకుండా కొంతమంది వ్యాపారులు దుకాణాల బయట, నివాసితులు ఇళ్ల వెలుపల సీసీ కెమెరాలు బిగించుకున్నారు. అయినప్పటికీ పట్టపగలు దొంగలు రెచ్చిపోతున్నారు. ప్రధానంగా ఒంటరిగా వున్న మహిళల మెడల్లో నుంచి బంగారం గొలుసులు, పుస్తెల తాళ్లు తెంచుకుని పరారయ్యే ముఠా సంచరిస్తున్నది. ఈ నెల 15వ తేదీ తులసీనగర్‌లో సీహెచ్‌సీకి వెళ్లే రోడ్డులో పొలమరశెట్టి అరుణ మెడలో నుంచి మూడు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కుని ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై పరారయ్యారు. అంతకు వారం రోజుల ముందు ఎల్‌ఐసీ కార్యాలయానికి సమీపంలో పాన్‌షాపు వద్దకు ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి కూల్ డ్రింక్ అడిగారు. షాపు యజమాని మేరీ కూల్ డ్రింగ్ సీసా ఇస్తుండగా.. ఆమె మహిళ మెడలో నుంచి రెండున్నర తులాల బంగారు గొలుసును తెంచుకుని పారిపోయారు.

గత నెలలో పట్టణంలోని బైపాస్ రోడ్డులో వున్న శ్రీరామచంద్రమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో పాన్‌షాపు నిర్వహించుకుంటున్న మరో మహిళ నుంచి ఇదే తరహాలో బంగారం గొలుసును లాక్కొని పరారయ్యారు. మార్చి 2వ తేదీన కొత్తలి గ్రామానికి సమీపంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తి ఆపి, అతని వద్ద నుంచి సెల్‌ఫోన్, కొంత నగదు దోచుకున్నారు.

ఈ తరహాలో చిన్నాచితకా సంఘటనలు జరుగుతున్నప్పటికీ అవి పోలీసు స్టేషన్ వరకు చేరడం లేదు. ఆగంతకులు జన సంచారం అంతగా లేని ప్రదేశాలను ఎంచుకుని ముందుగా రెక్కీ నిర్వహిస్తున్నారని, మహిళలు ఒంటరిగా కనిపిస్తే మెరుపు దాడి చేసి మెడలో నుంచి బంగారం గొలుసులు తెంచుకుని పరారవుతున్నారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పోలీసులు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి నిఘాను పెంచాలని, అదే విధంగా మరిన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికే నమోదైన కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి, నిందితులను పట్టుకుంటే ప్రజల్లో భయాందోళన తగ్గుతుందని అభిప్రాయపడుతున్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



అనకాపల్లిలో ఏసుక్రీస్తు శిలువ మోసే ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న క్రైస్తవులు

మానవాళి కోసం ప్రాణాలు విడిచిన జీసస్ త్యాగనిరతిని గుర్తు చేసుకుంటూ క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడేను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శిలువపై ప్రాణాలు విడిచిన పవిత్ర శుక్రవారం సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనకాపల్లి, చోడవరం, పాయకరావుపేట, ఎలమంచిలి తదితర ప్రాంతాల్లో జీసస్‌తో శిలువ మోయించడం, రోమన్ సైనికులు కొరడాలతో కొడుతూ వీధుల్లో ఊరేగించడం, శిలువ వేయడం వంటి ఘట్టాలను ప్రదర్శించారు. ఈ సన్నివేశాలను తిలకించిన పలువురు క్రైస్తవులు కంటతడి పెట్టుకున్నారు.



చోడవరంలో జీసస్‌ను శిలువ వేస్తున్న దృశ్యం

ఈదురు గాలులతో వర్షం

పలుచోట్ల కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

అనకాపల్లి, నర్సీపట్నం, కె.కోటపాడు, కృష్ణాదేవిపేట, అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం తరువాత మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు వీచడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కొన్ని మండలాల్లో వర్షం కురవనప్పటికీ ఆకాశం మేఘావృతమై గాలులు వీచాయి. దాదాపు అన్నిప్రాంతాల్లో మధ్యాహ్నం తరువాత వాతావరణం చల్లబడింది. అంతకుముందు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండతీక్షణంగా కాసింది. వేడిగాలులు సైతం వీచాయి. దీంతో రహదారులపై జనసంచారం తగ్గిపోయింది. మధ్యాహ్నం తరువాత వాతావరణం మారిపోయి ఆకాశం మేఘావృతమైంది. తొలుత ఈదురు గాలులు వీచాయి. అనంతరం వర్షం కురిసింది. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఎండ వేడి నుంచి సేదతీరారు.

- నర్సీపట్నంలో భారీ వర్షంతో పొంగిన డ్రైనేజీలు
- రామారావుపేటలో కారుపై పడిన చెట్టు
- కె.కోటపాడు, గొలుగొండ మండలాల్లో అధిక వర్షపాతం
- పలు మండలాల్లో తేలికపాటి జల్లులు
- చల్లబడిన వాతావరణం



అనకాపల్లిలో పడుతున్న వర్షం





నర్సీపట్నం మెయిన్ రోడ్డులో నిలిచిన వర్షం నీరు (ఇన్‌సెట్‌లో) రామారావుపేటలో కారు మీదకు ఒరిగిన చెట్టు

నర్సీపట్నంలో ఈదురు గాలులతో అర్ధ గంటపాటు భారీ వర్షం కురిసింది. రామారావుపేట యూనియన్ బ్యాంకు రోడ్డులో భారీ చెట్టు ఒరిగి కారు మీద పడింది. టీటీడీ కల్యాణ మండపం సమీపంలో విద్యుత్ వైర్లపై చెట్టు పడిపోవడంతో సరఫరా నిలిచిపోయింది. వెంకునాయుడుపేట, లక్ష్మీనగర్, శివపురం, బ్యాంకు కాలనీ, ప్రశాంతి నగర్‌లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మెయిన్ రోడ్డులో ... మిగతా 6వ పేజీలో

చెరువులోని రోడ్డును తొలగించాల్సిందే

లేదంటే చట్టప్రకారం చర్యలు

- రోలుగుంట మండలం రాజన్నపేటలో రాయి క్వారీ లీజుదారునికి అధికారులు నోటీసులు



చెరువు మధ్యలో నుంచి వేసిన రోడ్డును పరిశీలిస్తున్న తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులు (ఫైల్ ఫొటో)

రోలుగుంట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని రాజన్నపేటలో నిబంధనలకు విరుద్ధంగా సాగునీటి చెరువు మధ్యలో నుంచి రోడ్డు వేసిన నల్లరాయి క్వారీ యాజమానికి అధికారులు నోటీసులు జారీ చేశారు. రోడ్డును తొలగించి, చెరువు గర్భాన్ని పూర్వస్థితికి తీసుకురాకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసు కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మండలంలోని రాజన్నపేటలో ఏకా వీర్రాజు అనే వ్యక్తి నల్లరాయి క్వారీ నిర్వహిస్తున్నారు. ఇక్కడి నుంచి భారీ బండరాళ్లను రాంబిల్లి మండలంలో ఏర్పాటు చేస్తున్న నేవల్ ప్రత్యామ్నాయ బేస్ నిర్మాణ పనులకు తరలిస్తున్నారు. అయితే టిప్పర్ లారీలు క్వారీ నుంచి ప్రధాన రహదారికి చేరుకోవడానికి సరైన రోడ్డు లేకపోవడంతో సర్వే నంబరు 57/2లో వున్న భూపతి చెరువు మధ్యలో నుంచి మెటల్, మట్టితో తాత్కాలికంగా రోడ్డు వేశారు. ఈ విషయం తెలుసుకున్న జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు, పలువురు నాయకులు వచ్చి పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు లిఖిత పూర్వక పిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ నాగమ్మ, డీటీ శంకర్‌రావు, సర్వేయర్లు, మైనింగ్, ఇరిగేషన్ శాఖల అధికారులు ఈ నెల 11వ తేదీన క్షేత్ర స్థాయిలో పరిశీలించి ... మిగతా 6వ పేజీలో

ప్రతిపాదనల్లో వడ్డాది వారధి

మూడేళ్ల క్రితం కూలిన పాత వంతెన

- నెలలపాటు స్తంభించిన రవాణా
- తాత్కాలికంగా కాజ్‌వే నిర్మాణం
- పెద్దేరు నదికి వరద వస్తే ముంపు
- రూ.25 కోట్లతో కొత్త వంతెన నిర్మిస్తామన్న గత వైసీపీ పాలకులు
- అమలుకు నోచుకోని హామీ
- కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యే
- ప్రతిపాదనలు పంపాలని అధికారులకు ఆదేశాలు
- అనుమతులు వచ్చిన వెంటనే వంతెన నిర్మిస్తామంటున్న అధికారులు



వర్షా కాలంలో కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్ ఫొటో)

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):

మండలంలో వడ్డాది వద్ద పెద్దేరుపై వంతెన నిర్మాణం ఎప్పుడు మొదలవుతుందా అని రెండు జిల్లాలకు చెందిన పలు మండలాల ప్రజలు మూడేళ్ల నుంచి ఎదురుచూస్తున్నారు. పూర్వకాలంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరడంతో మూడేళ్ల క్రితం పాక్షికంగా కూలిపోయింది. కొద్ది నెలల తరువాత పక్కనే నదిలో నుంచి కాజ్‌వే నిర్మించారు. ఇది తక్కువ ఎత్తులో వుండడంతో పెద్దేరు నదికి వరద వస్తే వాహనాల రాకపోకలు స్తంభిస్తున్నాయి. కొత్త వంతెన నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది.

బుచ్చెయ్యపేట మండలం వడ్డాది వద్ద పెద్దేరు నదిపై దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరడం, ఆర్అండ్‌బీ అధికారులు నిర్వహణను పట్టించుకోక పోవడంతో 2022 మే నెల 12వ తేదీన వంతెన మధ్య భాగం కుంగిపోయింది. దీంతో అధికారులు వంతెన మీద వాహనాల రాకపోకలను నిలిపివేశారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు ప్రధాన మార్గంలో ఉన్న ఈ వంతెన కూలిపోవడంతో సుమారు నెల రోజులపాటు పలు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి కూలిన వంతెన ఖానాల మధ్య బండరాళ్లు, మట్టితో నింపి తేలికపాటి వాహనాల రాకపోకలకు అనుమతించారు. పాత వంతెనకు దిగువున సుమారు కోటిన్నర రూపాయలు వెచ్చించి కాజ్‌వే నిర్మించారు. అయితే ఇది ఎత్తు తక్కువగా వుండడంతో నదిలో వరద పెరిగితే కాజ్‌వే మునిగిపోతున్నది. బస్సులు, ఇతర ... మిగతా 6వ పేజీలో



మూడేళ్ల క్రితం కుంగిన వడ్డాది వంతెన (ఫైల్ ఫొటో)

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య



అప్పలనాయుడు (ఫైల్ ఫొటో)

సబ్బవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని ఇరువాడ శివారు గణపతినగర్‌లో ఒక యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. గణపతి నగర్‌కు చెందిన కర్రి అప్పలనాయుడు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇతని తండ్రి నారాయణ ఒడిశాలోని పారా దీప్‌లో కూలీగా పనిచేస్తుండగా, తల్లి లీలాకుమారి ఇక్కడ భవన నిర్మాణ కార్మికురాలిగా పని చేస్తున్నది. కాగా అప్పలనాయుడు గురువారం రాత్రి సమీపంలోని ఒక గ్రామంలో అమ్మవారి పండుగకు వెళుతున్నట్టు తల్లితో చెప్పి బయటకు వెళ్లాడు. తిరిగి అర్ధరాత్రి 1.30 గంటలకు ఇంటికి రాగా, తల్లి నిద్ర లేచి తలుపు తీసింది. అప్పలనాయుడు గదిలోకి వెళ్లగా, తల్లి బయట నిద్రించింది. అయితే అప్పలనాయుడు రాత్రి 2.30 గంటల సమయంలో పెందుర్తి మండలం చినముషిడివాడ దరి ఏకలవ్యనగర్‌లో ఉంటున్న స్నేహితుడు కేసుబోయిన సుబ్రహ్మణ్యంకు వీడియో కాల్ చేసి ... మిగతా 6వ పేజీలో

తాటిచెట్టు పైనుంచి జారిపడి సచివాలయ ఉద్యోగి మృతి



రాజేశ్ (ఫైల్

కోటవురట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని అన్నవరం గ్రామంలో సచివాలయ ఉద్యోగి ఒకరు తాడిచెట్టు పైనుంచి జారి పడడంతో మృతిచెందాడు. ఎస్ఐ రమేశ్ అందజేసిన వివరాల ప్రకారం.. అన్నవరానికి చెందిన పైల రాజేశ్ (23) మాకవరపాలెం మండలం జి.వెంకటాపురం సచివాలయంలో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం సెలవు కావడంతో స్నేహితులతో కలిసి తాటికాయలు కొట్టేందుకు చెట్టుఎక్కాడు. ఈ క్రమంలో కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. కోటవురట్ల ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషయంగా ఉండడంతో నర్సీపట్నం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహా ఉత్కంఠ

నేడే మేయర్‌పై కూటమి అవిశ్వాస తీర్మానం

- నెగ్గేందుకు 74 మంది సభ్యుల మద్దతు అవసరం
- ఫలితంపై ఇరువర్గాల్లోనూ టెన్షన్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై కూటమి కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం నోటీస్ ఇవ్వడంతో శనివారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం జరగనున్నది.. అవిశ్వాస తీర్మానం ఎలాగైనా నెగ్గాలని కూటమి నేతలు కృతనిశ్చయంతో ఉంటే... కోరం లేకుండా చేయడం ద్వారా తీర్మానం వీగిపోయేలా చేసేందుకు వైసీపీ నేతలు యత్నిస్తున్నారు. ఇరువర్గాలు ఎదుటి వర్గంలోని సభ్యులను తమ వైపు తిప్పుకునేందుకు భారీ నజరానాలు అందజేస్తుండడంతో ఏం జరుగుతుందోననే ఉత్కంఠ కొనసాగుతోంది.





సమావేశానికి సిద్ధం చేసిన కౌన్సిల్ హాల్

జీవీఎంసీకి నాలుగేళ్ల కిందట జరిగిన ఎన్నికల్లో మొత్తం 98 వార్డులకు గాను వైసీపీ 58 వార్డులు గెలుచుకోవడంతో పార్టీకి చెందిన గొలగాని హరివెంకటకుమారి మేయర్ అయ్యారు. తరువాత ఇండిపెండెంట్‌లుగా గెలిచిన నలుగురు కార్పొరేటర్లతోపాటు టీడీపీ కార్పొరేటర్ ఒకరు వైసీపీలో చేరారు. తర్వాత జరిగిన 32వ వార్డు ఉప ఎన్నికల్లో టీడీపీ స్థానాన్ని వైసీపీ దక్కించుకోవడంతో కౌన్సిల్‌లో ఆ పార్టీ బలం ఎక్స్ అఫీషియో సభ్యులు కాకుండా 64కు చేరింది. అయితే గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో కౌన్సిల్‌లో సమీకరణాలు తలకిందులైపోయాయి. వైసీపీకి చెందిన 19 మంది కార్పొరేటర్లు టీడీపీలో, మరో తొమ్మిది మంది జనసేనలో చేరిపోయారు. ఇండిపెండెంట్‌లు నలుగురిలో ఇద్దరు టీడీపీ, మరో ఇద్దరు జనసేనలో చేరారు. దీంతో మేయర్‌పై అవిశ్వాసం ... మిగతా 6వ పేజీలో

జీవీఎంసీలో ప్రస్తుత బలాబలాలు

కూటమి కార్పొరేటర్లు	64
కూటమి ఎక్స్‌అఫిషియో సభ్యులు	11
వైసీపీ కార్పొరేటర్లు	30
వైసీపీ ఎక్స్ అఫిషియో సభ్యులు	3
తటస్థంగా ఉన్న కార్పొరేటర్లు	3

లారీని ఢీ కొన్న వ్యాను

ప్రయాణికుడు దుర్మరణం


ప్రమాదంలో నుజ్జయిన వ్యాను

ఎలమంచిలి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధి యర్రవరం సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి. తుని నుంచి అనకాపల్లి వైపు వస్తున్న బొలేరో వాహనం యర్రవరం వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొంది. దీంతో బొలెరో ప్రయాణిస్తున్న రాజస్థాన్‌కు చెందిన కృష్ణకుమార్ (29) ఆ వాహనంలో ఇరుక్కు పోవడంతో మృతి చెందాడు. ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కారులో తరలిస్తున్న ఒడిశాకు చెందిన

105 టిన్ బీర్లు గుర్తింపు


పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు, మద్యం టిన్లు

మునగపాక, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వాహన తనిఖీల్లో భాగంగా ఒడిశాకు చెందిన 105 టిన్ బీర్లను గుర్తించామని ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం అర్ధరాత్రి వరకు మునగపాక జంక్షన్‌లో వాహన తనిఖీలు చేపట్టామన్నారు. అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వైపు వెళ్తున్న కారులో కాకినాడకు చెందిన గోవింద అనే వ్యక్తి అక్రమంగా టిన్ బీర్లు తరలిస్తుండగా గుర్తించామన్నారు. టిన్ బీర్లతో పాటు పాటు కారును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్టు చెప్పారు. గోవింద అనే వ్యక్తి అరెస్టు చేసి శుక్రవారం కోర్టుకు తరలించామన్నారు.

నీటిపారుదల రంగానికి పెద్దపీట

- వైసీపీ హయాంలో ఆక్రమణల నిగ్గు తేల్చుతాం
- నియోజకవర్గానికి గోదావరి జలాలు తీసుకు వచ్చి సస్యశ్యామలం చేస్తాం
- ఏషియన్ పెయింట్స్ సహాయంతో నిర్మించిన చెక్ డ్యామ్, పునరుద్ధరించిన చెరువుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే 'సుందరపు'


చిన్నోడుపాలెంలో డ్యామ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక/అచ్యుతాపురం/అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నీటి పారుదల రంగాన్ని నిర్లక్ష్యం చేసి, రైతుల వెన్ను విరిచిన పాపం వైసీపీ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మునగపాక మండలం చిన్నోడుపాలెం గ్రామంలో ఏషియన్ పెయింట్స్ ఆర్థిక సహాయంతో నిర్మించిన చెక్ డ్యామ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. ఆవ ఖండం నుంచి సర్వే జరుగుతోందని, వైసీపీ హయాంలో జరిగిన ఆక్రమణలన్నీ బయటకు వస్తాయన్నారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజుపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు నిర్వహించి, ఆక్రమించిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందన్నారు. గోదావరి జలాలను నియోజకవర్గానికి తీసుకు వచ్చి సస్యశ్యామలం చేస్తామన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం పి4 పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. అనకాపల్లి నుంచి నాగవరం రోడ్డు విస్తరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ సాయి ప్రశాంతి, ఏషియన్ పెయింట్స్ ప్రతినిధులు, టీడీపీ, జనసేన మండల శాఖల అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురాం, కూటమి నాయకులు దాడి మునిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, ఆడారి గోవింద తదితరులు పాల్గొన్నారు. అలాగే, అచ్యుతాపురం మండలం మడుతూరులో ఏషియన్ పెయింట్స్ సీఎస్ఆర్ నిధులతో అంబుజా ఫౌండేషన్ పర్యవేక్షణలో అభివృద్ధి పరచిన ఎర్రచెరువు, దోసూరు బాబుగారి చెరువు, ఆవరాజం గ్రామంలో ఊర చెరువులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువుల పునరుద్ధరణ వల్ల సాగు నీటితో పాటు భూగర్భ జలాలు పెరిగి తాగునీటికి కూడా ఇబ్బందులు ఉండవన్నారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన కార్యదర్శి మోటూరు శ్రీవేషి, సర్పంచులు మోటూరు సంజీవి, నర్మాల సుజాత, కె.పవన్ విజయ్, రాజాన అప్పారావు, మోటూరు త్రినాథస్వామి, బలిరెడ్డి శ్రీను, ఆవరాజంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ వియ్యపు నానాజీ, గ్రామ పెద్దలు కోలా మహేష్, రమణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


అచ్యుతాపురం మండలం మడుతూరు ఎర్రచెరువు వద్ద శిలా ఫలకం ఆవిష్కరణ

'ఎమ్మెల్యేపై జడ్పీటీసీ స్వామివి తప్పుడు ఆరోపణలు'

మునగపాక, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే విజయకుమార్ సహకరించడం లేదని జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ తప్పుడు ఆరోపణలు చేయడం తగదని మాజీ జడ్పీటీసీ, జనసేన పార్టీ మండల శాఖ ఇన్‌చార్జి జనపరెడ్డి శ్రీనివాసరావు అన్నారు. ఇక్కడ జనసేన కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే విజయకుమార్ నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకుడు ఎ.వి.సత్యనారాయణ, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మొల్లేటి సత్యనారాయణ, అచ్యుతాపురం జనసేన మండల అధ్యక్షుడు రాందాసు, కూటమి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, వేగి కృష్ణ, ఆడారి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు హెరిటేజ్ అధికారులు సన్మానం

రాంబిల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా హెరిటేజ్ డెయిరీ పనిచేస్తుందని డెయిరీ జోనల్ మేనేజర్ వి.దివాకరరావు అన్నారు. కృష్ణంపాలెం గ్రామంలో డెయిరీకి అధికంగా పాలు పోస్తున్న రైతులను శుక్రవారం సన్మానించారు. అనంతరం పలువురికి దుప్పట్లు అందజేశారు. డెయిరీ డాక్టర్ హేమచంద్రరావు పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించారు.హెరిడెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు, హెచ్‌పీఆర్ ఆర్.సత్తిబాబు పాల్గొన్నారు.

టీటీడీపై వైసీపీ విష ప్రచారం : ప్రగడ

అచ్యుతాపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానంపై వైసీపీ విషప్రచారం మానుకోవాలని రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఇక్కడ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనతో టీటీడీ ప్రతిష్టను భ్రష్టుపట్టించారన్నారు. నాడు గోశాలను పట్టించుకోకుండా నాశనం చేసి, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో గోవులు చనిపోయాయని చెపుతుండడం హాస్యాస్పదమన్నారు. వైసీపీ హయాంలోనే భారీసంఖ్యలో గోవులు చనిపోయాయని ఆరోపించారు. నాసిరకం దాణా, మం దుల వాడకంతో మృత్యువాత పడ్డాయన్నారు. దీనికి అప్పటి గోశాల డైరెక్టర్ హరనాథరెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

అగ్ని ప్రమాదంలో రెండు పూరి పాకలు దగ్ధం

రాంబిల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : రాజుకోడూరు సమీపంలో శుక్రవారం రెండు పూరిపాకలు దగ్ధమయ్యాయి. ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో కట్టెల పొయ్యి నుంచి ప్రమాదవశాత్తు మంటలు ఎగసి పడడంతో గ్రామానికి చెందిన ఎం.లోవరాజు, రావి అర్జునరావులకు చెందిన పాకలు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానికులు ఎలమంచిలి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అం దించగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే పాకలు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.రెండు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు బాధితులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

- చర్చిల్లో ప్రార్థనలు
- ఏసు శిలువ మోసిన దృశ్యాలతో వేషధారణ


క్రీస్తుతో శిలువ మోయించడం, శిలువ వేయడం వంటి దృశ్యాలను కళ్లకు కట్టినట్టు చూపిన ఎలమంచిలిలోని ఆర్‌సీఎం చర్చి సభ్యులు

ఎలమంచిలి/ రాంబిల్లి/ మునగపాక/ అచ్యుతాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : గుడ్ ఫ్రైడేను నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గల క్రైస్తవులంతా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎలమంచిలి పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో క్రీస్తుతో రాజభటులు శిలువ మోయించడం మొదలుకుని, శిలువ వేసిన సన్నివేశాలను కళ్లకు కట్టినట్టుగా వేషధారణలతో చూపారు. ఈ దృశ్యాలను చూసిన వారు జీసస్ వేదన, కష్టాలను గుర్తుచేసుకుని కన్నీరుపెట్టుకున్నారు. ఆంధ్రా సెంటినరీ బాప్టిస్టు ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంఘ పాలక వర్గసభ్యులు మోజెస్, ఆనంద్, రమణ, శామ్యూల్, కరుణ వేణి, శ్యామల, రాజశేఖర్, చర్చి విశ్వాసులు పాల్గొన్నారు. అలాగే, మునగపాక మండలంలోని పలు గ్రామాల్లో గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మానవాళికి ఏసు ప్రభువు ఇచ్చిన సందేశాన్ని పాస్టర్లు వినిపించారు. రాంబిల్లి మండలంలోని చర్చిల్లో గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాంబిల్లి, అప్పన్నపాలెం, గొరపూడి, వెల్చూరు, కొత్తపట్నం, కొత్తపేట, లాలంకోడూరు, గోవిందపాలెం, నారాయణపురం, కొత్తూరు, దిమిలి, సంతపాలెం తదితర గ్రామాల్లో గల చర్చిల్లో ఏసు ప్రభువు మానవాళికి ఇచ్చిన శాంతి సందేశాన్ని పాస్టర్లు వినిపించారు. ఈ కార్యక్రమంలో ఆయా చర్చిల పాస్టర్లు ఎం.సుధీర్, జాషువారాయ్, మోజేస్, వి.కాలేబు, జూమ్స్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, అచ్యుతాపురం మండలంలోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పాస్టర్లు ఏసు ప్రభువు శాంతి సందేశాన్ని చదివి వినిపించారు.

పాయకరావుపేటలో...


ఏసుప్రభువును శిలువ వేసినట్టు ప్రదర్శన

పాయకరావుపేట: పట్టణంలో క్రైస్తవ సోదరులు శుక్రవారం గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్లు బి.జయప్రసాద్, కె.మరియన్న ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అనంతరం శిలువ మోస్తున్న ఏసుప్రభు వేషధారిని సైనికులు మెయిన్ రోడ్డు, లింగాల కాలనీ మీదుగా జాతీయ రహదారి అవతల ఉన్న కల్వరి కొండ పైకి తీసుకెళుతున్న దృశ్యాన్ని ప్రజలు అత్యంత ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో చర్చి కమిటీ పెద్దలు పెదపాటి మేఘరంజన్, వేమగిరి నూకరాజు, వేమగిరి లక్ష్మణ్, కంచర్ల రాజుబాబు, పల్లా, నెలపర్తి నాగేశ్వరరావు, సాంబారు సత్యనారాయణ, కనోస్సా సిస్టర్స్ పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో...

ఎస్.రాయవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న క్రైస్తవ మతస్థులందరూ శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రతి ఒక్కరూ ఆయా గ్రామాల్లో ఉన్న చర్చిలకు తరలివెళ్లి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిలకు వచ్చిన ఏసుప్రభు భక్తులందరికీ అక్కడి పాస్టర్‌లు గుడ్ ఫ్రైడే విశిష్టత గురించి వివరించారు. చర్చిలన్నీ భక్తుల తాకిడితో సందడి వాతావరణం కనిపించింది.

కోటవురట్లలో...


కోటవురట్ల కేకేబీ చర్చిలో విశ్వాసులు ప్రార్థిస్తున్న దృశ్యం


కోటవురట్ల: క్రైస్తవ భక్తులు గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని పందూరు, గొట్టివాడ, కైలాసపట్నం, జల్లూరు, రాట్నాలపాలెం, పాములవాక, లింగాపురం గ్రామాల్లో క్రైస్తవభక్తులు ఉపవాసంతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కోటవురట్ల కేకేబీ చర్చి, బేతెస ప్రార్థన మందిరంలో శుక్రవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసు మరణానికి ముందు శిలువపై పలికి ఏడు మాటలను ఏడుగురు వ్యక్తులు పరిశుద్ధి గ్రంథం అనుసరించి బోధించారు. పాస్టర్లు పీఆర్ బాబు, మోషే, పెద్దలు ఎం.ఆనందరాజ్, ఆర్.ప్రసన్నకుమార్, ఆర్.నానిమణిమోహన్, ఎస్.సాందీప్‌రాజ్. ఎంశ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

బాణసంచా పేలుడు మృతుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా


నాగరాజు కుటుంబానికి చెక్కు అందజేస్తున్న అధికారులు, కూటమి నాయకులు

కోటవురట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైలాసపట్నంలో బాణసంచా తయారీ కేంద్రంలో ఇటీవల జరిగిన పేలుడుతో తీవ్రంగా గాయపడి గురువారం మృతిచెందిన జల్లూరు నాగరాజు కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.15 లక్షల చెక్కును శుక్రవారం అధికారులు, కూటమి నాయకులు అందించారు. ఈ నెల 13వ తేదీన జరిగిన విస్ఫోటనంలో నాగరాజు తీవ్రంగా గాపడడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే పరిస్థితి విషమించడంతో గురువారం ఉదయం మృతిచెందిన విషయం తెలిసిందే. తిరుమలబాబు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, తదితరులు శుక్రవారం కోటవురట్ల శివారు రాట్నాపాలెంలో నాగరాజు ఇంటికి వెళ్లి భార్య అప్పలనరసకు రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అందజేశారు. కేంద్ర ప్రభుత్వం తరపున మరో రూ.2 లక్షల సాయం త్వరలో అందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, జనసేన పార్టీ అధ్యక్షుడు సింగంపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు పి.సూర్యారావు, పల్లెల నాగేశ్వరరావు, కాకర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల ఎస్ఐ రమేశ్‌కు ఎస్పీ ప్రశంసలు


ఎస్ఐ రమేశ్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

కోటవురట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన ముఠాను ఇటీవల రాజుపేట జంక్షన్‌లో పట్టుకున్నం దుకు ఎస్ఐ రమేశ్‌కు జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ప్రశంసాపత్రం అందజేశారు. జిలాల్లోని వివిధ మండలాలు, పట్టణాల్లో నమోదైన 23 చోరీల కేసులకు సంబంధించి ఐదుగురు నిందితులను ఈ నెల 16వ తేదీన కోటవురట్ల పోలీసులు అరెస్టు చేసి సుమారు రూ.63 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

అలాగే కైలాసపట్నం బాణసంచా పేలుడు ఘటనలో ఎస్ఐ రమేశ్ సేవలను గ్రామస్థులు ప్రశంసించారు. ఎస్ఐ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి ధైర్యసాహసాలతో మృతదేహాలను బయటకు తీశారని, క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించడంలో సహకరించారని వారు పేర్కొన్నారు. ఈ మేరకు చౌడువాడ సర్పంచ్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐను సన్మానించారు.

చెరువులో రోడ్డును తొలగించాల్సిందే

... 5వ పేజీ తరువాయి

సర్వే చేశారు. నిబంధనలకు విరుద్ధంగా చెరువులో నుంచి రోడ్డు నిర్మించినట్టు నిర్ధారించారు. దీనివల్ల చెరువు మనుగడకు ముప్పు వాటిల్లుతుందని, ఆయకట్టుకు నీరు అందక రైతులు ఇబ్బంది పడతారని గుర్తించారు. చెరువులో నుంచి వేసిన రోడ్డును తక్షణమే తొలగించి, చెరువు గర్భాన్ని పూర్వ స్థితికి తీసుకురావాలని ఇరిగేషన్ ఏఈ డి.సూర్యనారాయణ, క్వారీ లీజుదారుడు ఏకా వీర్రాజుకు నోటీసులు జారీ చేశారు. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేట నిషేధ భృతికి బోట్లు, మత్స్యకారుల సర్వే

నక్కపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు భృతి చెల్లించడానికి అధికారులు సముద్ర తీర గ్రామాల్లో సర్వే చేపట్టారు. వేట నిషేధ భృతిని ఈ నె 26న ఆయా మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో లైసెన్సుడ్ బోట్లు, గుర్తింపు పొందిన మత్స్యకారుల జాబితాను తయారు చేసేందుకు మత్స్య శాఖ శ్రీకారం చుట్టింది. శుక్రవారం రాజయ్యపేట తీరంలో ఈ కార్యక్రమాన్ని ఫీల్డ్ అసిస్టెంట్ త్రినాథ్, నాగమణి చేపట్టారు. ఏ బోటుపై ఎంతమంది మత్స్యకారులు వేట సాగిస్తున్నారన్న వివరాలను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు పిక్కి కోదండరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


రాజయ్యపేటలో మత్స్యకారుల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం

నక్కపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల వేత న బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. మండలంలోని డీఎల్‌పురం, తమ్మయ్యపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనకాపల్లి జిల్లాలో రూ 80 కోట్లు, నక్కపల్లి మండలంలో రూ 4 కోట్ల వేతన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.వారాల తరబడి కూలి డబ్బులు చెల్లించకపోతే వారు కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు, ఐఏఎస్, ఐపీఎస్‌లకు ప్రతీ నెలా మొదటి రోజే జీతాలు అందుతున్నాయని, కూలీలకు మాత్రం సకాలంలో ఇవ్వడం లేదన్నారు. ఆయన వెంట సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, సర్పంచ్ కిల్లాడ రామకృష్ణ, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాప్టివ్ పోర్టు అనుమతులను రద్దు చేయాలి

నక్కపల్లి: మండలంలోని డీఎల్‌పురం ప్రాంతంలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ కోసం అవసరమైన క్యాప్టివ్ పోర్టును ఏర్పాటు చేసుకోవడానికి ఈ నెల9వ తేదీన రాష్ట్ర మంత్రివర్గం ఇచ్చిన అనుమతులను వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. శుక్రవారం డీఎల్‌పురంలో క్యాప్టివ్ పోర్టు ఏర్పాటు చేసే ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు.మత్స్యకారులతో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి వివరించారు. ఏకపక్షంగా డీఎల్‌పురంలో మిట్టల్ స్టీల్‌ప్లాంట్ కోసం ప్రభుత్వం క్యాప్టివ్ పోర్టుకు అనుమతులు ఇవ్వడం చట్ట ఉల్లంఘనే అవుతుందని చెప్పారు. సుమారు 3కి.మీ సముద్రతీరాన్ని కార్పొరేట్ కంపెనీకి అప్పగించడం బాధాకరమన్నారు. క్యాప్టివ్ పోర్టు వల్ల మత్స్యకారుల జీవనోపాధి పూర్తిగా దెబ్బతింటుందన్నారు. మత్స్యకారుల జీవనోపాధి కోసం ఫిషింగ్ జెట్టీలు, ఫిష్ లాండింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. అర్హులకు రెండేళ్ల వేట నిషేధ పరిహారం రూ.40 వేలు చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు. ఆయన వెంట సర్పంచ్ కిల్లాడ రామకృష్ణ, సీపీఎం నేతలు కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు, రాజేశ్, బొబ్బిల్లి దేవుళ్లు, చిరంజీవి పాల్గొన్నారు.

ఈదురు గాలులతో వర్షం

... 5వ పేజీ తరువాయి

డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో కాలువలు పొంగి రోడ్లపై ప్రవహించాయి. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు.

కె.కోటపాడు మండలంలోని పలు గ్రామాల్లో ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. సుమారు గంటపాటు భారీ వర్షం కురిసింది. కింతాడ పంచాయతీ గ్రామ శివారు రామచంద్రపురంలో రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికులు చెట్టును నరికివేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కాగా కూరగాయ పంటలకు గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షం పడింది. ఏఎల్‌పురంలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అనకాపల్లి పట్టణంలో శుక్రవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై సుమారు పది నిమిషాలపాటు వర్షం కురిసింది. దీంతో ఫుట్ పాత్ వ్యాపారులు ఇబ్బంది పడ్డారు.

ప్రతిపాదనల్లోనే వడ్డాది వారధి

... 5వ పేజీ తరువాయి

భారీ వాహనాలను వేరే మార్గాల్లోకి మళ్లించాల్సి వస్తున్నది.

కాగా వడ్డాది వద్ద కూలిన వంతెన స్థానంలో సుమారు రూ.25 కోట్లతో కొత్త వంతెన నిర్మిస్తామని అప్పట్లో ఎమ్మెల్యేగా వున్న కరణం ధర్మశ్రీ చెప్పారు. అధికారులతో ప్రతిపాదనలు సైతం తయారు చేయించారు. కానీ ఆయన పదవిలో వున్నంత కాలం ప్రభుత్వం నుంచి ఆమోదం లభించలేదు. తాము అధికారంలోకి వస్తే వడ్డాది వద్ద కొత్త వంతెన నిర్మిస్తామని గత ఏడాది సాధారణ ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు హామీ ఇచ్చారు. జూన్ 17వ తేదీన ఎంపీ సీఎం రమేశ్.. చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబుతో కలిసి పాత వంతెన, కాజ్‌వేను పరిశీలించారు.

కొత్త వంతెన నిర్మాణానికి తక్షణమే ప్రతిపాదనలు చేసి పంపాలని సంబంధిత అధికారులను ఎంపీ రమేశ్ ఆదేశించారు. ఇంతవరకు ఎటువంటి పురోగతి లేదు. కాగా వడ్డాది వద్ద పెద్దేరు నదిపై కొత్త వంతెన నిర్మాణం గురించి ఆర్అండ్‌బీ ఏఈ సాయిశ్రీనివాస్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. నూతన వంతెన నిర్మాణానికి రూ.25 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపామని చెప్పారు. అనుమతులు మంజూరు కాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

మహా ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

ప్రకటిస్తూ కూటమి కార్పొరేటర్లు 58 మంది సంతకాలు చేసి గత నెల 21న జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌కు నోటీస్ ఇచ్చారు. సంతకాల ధ్రువీకరణ అనంతరం అవిశ్వాస తీర్మానంపై శనివారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు.

తీర్మానం నెగ్గాలంటే 74 మంది సభ్యుల మద్దతు అవసరం

మేయర్ హరివెంకటకుమారిపై అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే కూటమికి 74 మంది సభ్యుల మద్దతు అవసరం. 97 మంది కార్పొరేటర్లతోపాటు 14 మంది ఎక్స్‌అఫీషియో సభ్యులు కలుపుకుని 111 మంది ఓటుహక్కు కలిగిన సభ్యులు ఉన్నారు. టీడీపీకి 48, జనసేనకు 14, బీజేపీకి ఇద్దరు కార్పొరేటర్లు.. కూటమికి మొత్తం 64 మంది కార్పొరేటర్ల బలం ఉంది. వైసీపీకి 30 మంది, సీపీఐ, సీపీఎంకి ఒక్కొక్కరు ఉన్నారు. ఇటీవలే వైసీపీకి రాజీనామా చేసిన ఆరో వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక (మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కుమార్తె) తన వైఖరిని ఇంకా ప్రకటించలేదు. సీపీఐ, సీపీఎం కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానంపై జరిగే సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. వైసీపీ కూడా సమావేశాన్ని బహిష్కరించాలని నిర్ణయించింది. కూటమి చేతిలో ఉన్న 64 మంది కార్పొరేటర్లతోపాటు 11 మంది ఎక్స్‌అఫీషియో సభ్యులు సమావేశానికి హాజరైతే అవిశ్వాస తీర్మానం నెగ్గేందుకు అవకాశం ఉంటుంది. వీరితోపాటు ముత్తంశెట్టి ప్రియాంక కూడా హాజరయ్యే అవకాశం ఉందంటున్నారు. అయితే అవిశ్వాస తీర్మానం నెగ్గకుండా వుండేందుకు వైసీపీ నేతలు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. కూటమిలో చేరిన వైసీపీ కార్పొరేటర్లను తిరిగి తమ వైపు లాక్కోవాలని చూస్తున్నారు. ఒకరిద్దరు కార్పొరేటర్లకు భారీ నజరానా ఆశ చూపించి కౌన్సిల్ సమావేశానికి హాజరుకాకుండా చేయడం, లేదంటే కౌన్సిల్‌కు హాజరైనా.. అవిశ్వాసానికి మద్దతుగా చెయ్యి ఎత్తకుండా ఉండేలా ఒప్పందం చేసుకున్నట్టు సమాచారం. దీంతో కూటమి నేతలు ఒకింత ఆందోళన చెందుతున్నారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

... 5వ పేజీ తరువాయి

తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. ఎటువంటి అఘాయిత్యానికి పాల్పడవద్దని, వెంటనే బయలుదేరి వస్తున్నానని అతను చెప్పాడు. వెంటనే మరో స్నేహితుడితో కలసి గణపతినగర్‌కు వచ్చాడు. అప్పలనాయుడు ఇంటికి వెళ్లి అతని తల్లిని నిద్ర లేపి, విషయం చెప్పి తలుపు తీయించాడు. అయితే అప్పటికే అప్పలనాయుడు ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. వెంటనే కిందకు దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ వి.సింహాచలం శుక్రవారం గణపతినగర్ వెళ్లి వివరాలు సేకరించారు. అప్పలనాయుడు తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



అర్లలో దోమల నివారణ మందును పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది

మలేరియా నివారణ ద్రావకం పిచికారీ

రోలుగుంట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మలేరియా నియంత్రణలో భాగంగా దోమల నివారణకు అవసరమైన మందు పిచికారీ పనులను శుక్రవారం ప్రారంభించారు. అపిడమిక్ సీజన్ సమీపిస్తుండడంతో ముందస్తు చర్యల్లో భాగంగా బుచ్చెంపేట పీహెచ్‌సీ పరిధిలోని అర్ల గ్రామంలో శుక్రవారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి బెన్నయ్య మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా ప్రబలకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మొదటి విడత స్ప్రేయింగ్ 15 రోజుల పాటు స్ప్రేయింగ్ చేపడతామని, గ్రామంలో ఇళ్లన్నింటికీ స్ప్రేయింగ్ పూర్తి చేయాలని సిబ్బందికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రమాకాంతారావు, పీహెచ్ఎన్ నారాయణమ్మ, హెచ్‌వీ సన్యాసమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూలోకమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంటికొర్లాం గ్రామంలో శుక్రవారం భూలోకమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, నాయకులు అడపా నరసింహమూర్తి, కర్రి తమ్మునాయుడులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచ్ శనివాడ నాయుడుబాబు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఏఎంసీ చైర్మన్ పుప్పాలకు సన్మానం



అమ్మవారి ఆలయంలో అప్పలరాజును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

మాడుగుల/మాడుగుల రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజును శుక్రవారం వీరవిల్లి అగ్రహారం నాయకులు సత్కరించారు. మాడుగులలోని ఆయన స్వగృహంలో అప్పలరాజుని కలుసుకుని పూలమాల వేసి సత్కరించారు. ఈ సందర్భంగా అప్పలరాజు వారు అభినందించారు. నాయకులు పుప్పాల లక్ష్మీనారాయణ, గరిగిపాటి మేఘారావు, దాడి రాజేశ్వరరావు, కె.బల్లబాబు పాల్గొన్నారు.

అలాగే మాడుగుల శ్రీదేవి ఆలయంలో సివిల్ మోటార్స్ యూనియన్, దేవి ఆలయ కమిటీ సభ్యులు చైర్మన్ అప్పలరాజును సన్మానించారు. అలాగే ఆయన పేరుతో ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కొండలరావు, ప్రసాదరావు మాట్లాడుతూ అప్పలరాజు ఎంతోమందికి జీవనోపాధి కల్పించారన్నారు. ఆయన సేవలను గుర్తించి చైర్మన్ పదవి ఇవ్వడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు బి.నరసింహమూర్తి, యల్లారావు, కొండలరావు, రమణ, జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ఆరుగురి అరెస్టు



గంజాయి నిందితులతో డీఎస్పీ శ్రీనివాసరావు, పక్కన సీఐ, ఎస్ఐ

నర్సీపట్నం అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ నుంచి గంజాయి రవాణా చేస్తున్న ఆరుగురిని పట్టుకున్నట్టు డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. గబ్బాడ ప్రాంతంలో రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ రాజారావు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపడుతుండగా, ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను దూరంగా ఆగారని, పోలీసులకు అనుమానం వచ్చి పరిశీలించగా గంజాయితో పట్టుబడ్డారని చెప్పారు. అప్పటికే కోయంబత్తూరు నుంచి వచ్చిన మరో నలుగుర్ని గంజాయితో పట్టుకున్నట్టు ఆయన తెలిపారు. వీరి నుంచి 60 కిలోల గంజాయి, ఒక బైక్, ఆరు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

తాగునీటి సమస్యపై ఆదివాసీల ఆందోళన



ఖాళీ బిందెలతో వినూత్నంగా నిరసన తెలుపుతున్న ఆదివాసీలు

రావికమతం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చీమలపాడు పంచాయతీలోని శివారు అజయ్‌పురం గ్రామంలో ఆదివాసీలు తాగునీటి సమస్యపై ఖాళీ బిందెలతో శుక్రవారం నిరసన తెలిపారు. తాగునీటి కోసం 2019లో రూ.8.4 లక్షలతో మినీ వాటర్ స్కీమ్ ఏర్పాటు చేశారని, విద్యుత్ వైర్లు కాలిపోవడంతో 20 రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదని వారు వాపోయారు. బిందెడు తాగునీటి కోసం కిలోమీటరు దూరంలో ఉన్న చలమల నీటిని సేకరించుకుని గొంతు తడుపుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భగవంతురావు, పంచాయితీ కార్యదర్శి గ్రామాన్ని సందర్శించి సాంకేతిక లోపాన్ని సరిచేయాలని సూచించినా అధికారులు పట్టించుకోలేదన్నారు. దీంతో చలమల నీటిపైనే ఆధారపడుతున్నామని, కలుషిత నీరు తాగడంతో రోగాల బారిన పడుతున్నామని వారు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

టీడీపీ గుర్తింపు కార్డుల పంపిణీ


నర్సీపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో టీడీపీ గుర్తింపు కార్డులను 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ కన్వీనర్లు, వార్డు నాయకులు ఇంటింటికీ వెళ్లి గుర్తింపు కార్డులు అందజేయాలని సూచించారు. సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు. టీడీపీ పట్టణ కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

లక్ష్యం నీరుగారుతోంది..!

కల్యాణపులోవ రక్షిత నీటి పథకం నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు

రూ.32.2 లక్షల వ్యయంతో పనులు.. ప్రారంభానికి ముందే లీకులు

ఆదివాసీలకు తప్పని తాగునీటి వెతలు.. పట్టించుకోని అధికారులు



జల్‌జీవన్ పథకంలో నిర్మించిన రక్షిత నీటి పథకం....

(ఇన్‌సెట్‌లో) ట్యాంకు నుంచి లీకవుతున్న నీరు

రూ.32.2 లక్షలు.. కల్యాణపులోవలో ఆదివాసీల తాగునీటి కష్టాలు తీర్చడానికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు.. ఇంకేముంది? ఇంత మొత్తంలో నిధులు విడుదలయ్యాక సమస్య పరిష్కారమైపోయినట్టేనని అనుకుంటే పొరబడినట్టే! ఈ పథకం నిర్మాణాన్ని పూర్తిచేయకపోవడం.. నాణ్యతకు తిలోదకాలు ఇవ్వడం.. అందుబాటులోకి రాకముందే ట్యాంకు నుంచి నీరు లీకవుతుండడం.. వెరసి ఆదివాసీల తాగునీటి వెతలు కొనసా...గుతూనే ఉన్నాయి.

రావికమతం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని చీమలపాడు శివారు కల్యాణపులోవలో 50 గిరిజన కుటుంబాలకు తాగునీటి కోసం సుమారు 30 ఏళ్ల కిందట రక్షిత నీటి పథకం నిర్మించారు. అది శిథిలావస్థకు చేరడంతో ఐదేళ్ల కిందట వైసీపీ ప్రభుత్వం హయంలో జల్‌జీవన్ పథకంలో ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరు అందించాలనే ఉద్దేశంతో రూ.32.2 లక్షల వ్యయంతో 20 వేల లీటర్ల సామర్థ్యం గల (ఓవర్‌హెడ్) పథకం మంజూరు చేశారు. 2023లో కాంట్రాక్టర్ నిర్మాణ పనులు చేపట్టారు. అయితే మొదటి నుంచి నాణ్యతా ప్రమాణాలు పాటించలేదనే విమర్శలు ఆదివాసీల నుంచి వ్యక్తమవుతున్నాయి. అప్పట్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో నాణ్యతాప్రమాణాలు పాటించలేదని వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రారంభానికి ముందే ట్యాంకు నుంచి నీరు లీకవుతున్నదని మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్థులు నిరసన చేపట్టగా, చివరి దశలో పనులను పూర్తి చేయకుండా కాంట్రాక్టరు వదిలేశారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రక్షిత నీటి పథకాన్ని పూర్తిచేసి తాగునీటిని సరఫరా చేయాలని గ్రామానికి చెందిన వంపూరి బానుమతి, కొత్తెం దేవుడమ్మ, పెద్దిమ్మ, పెదపూడి మోదకొండమ్మ, భవానీ వేడుకుంటున్నారు.

ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భగవంతురావు వద్ద ప్రస్తావించగా, కల్యాణపులోవలో రక్షిత నీటి పథకాన్ని గత ప్రభుత్వ హయాంలో అప్పటి అధికారుల పర్యవేక్షణలో నిర్మించారన్నారు. ట్యాంకు నుంచి నీరు లీకవుతున్న మాట వాస్తవమేనన్నారు. అయితే పనులు ఇంకా పూర్తికావాల్సి ఉందని, ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లామని, త్వరలోనే కాంట్రాక్టరు సమస్యను పరిష్కరిస్తారని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

చర్చిలలో క్రైస్తవుల ప్రార్థనలు.. క్రీస్తు శిలువతో ర్యాలీలు



రావికమతం: కొత్తకోటలో శిలువతో శాంతి ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

చోడవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మానవాళి పాపాల కోసం ప్రాణాలు విడిచిన జీసస్ త్యాగనిరతిని గుర్తు చేసుకుంటూ గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శిలువపై ప్రాణాలు విడిచిన పవిత్ర శుక్రవారం సందర్భంగా చర్చిలలో క్రైస్తవులు ప్రార్థనల్లో నిమగ్నమయ్యారు. గాంధీగ్రామం ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో జీసస్ శిలువను మోస్తూ అనుభవించిన వేదన, కష్టాలను గుర్తుచేసేలా పట్టణంలో జీసస్ వేషధారణలో భక్తులు ప్రత్యేకంగా ప్రదర్శన నిర్వహించి భక్తిప్రపత్తులను చాటుకున్నారు. జీసస్‌ను స్తుతిస్తూ క్రైస్తవులు వెంటరాగా, చర్చి నుంచి ప్రారంభించి పట్టణంలోని పలు కాలనీల మీదుగా సాగించిన యాత్ర అందరినీ ఆకట్టుకుంది. పట్టణమంతా ప్రదర్శన నిర్వహించిన తరువాత, చర్చి వద్ద క్రీస్తు ఏసును శిలువ వేసే కార్యక్రమంతో గుడ్‌ఫ్రైడే కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆర్సీఎం చర్చి ఫాదర్లు ప్రసాద్, ఇసిడోర్ టప్పో, బాలస్వామి, అధిక సంఖ్యలో క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో...

నర్సీపట్నం: నర్సీపట్నం మండలంతో పాటు పట్టణంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రార్థనా మందిరాలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శుక్రవారం పెదబొడ్డేపల్లి ఆర్సీఎం చర్చి ఫాదర్ సౌరిబాబు ఆధ్వర్యంలో యేసు ప్రభు మరణ పాటుల చిత్ర పటాలు ప్రదర్శిస్తూ, ప్రార్థనా కీర్తనలు ర్యాలీ చేశారు. నర్సీపట్నం సీబీఎం కాంపౌండ్ ఆవరణలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రావికమతంలో...

రావికమతం: మండలంలోని కొత్తకోటలో ఆర్‌సీఎం చర్చి నిర్వాహకులు, క్రైస్తవ సభ్యులు గుడ్‌ఫ్రైడేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గత 45 రోజులుగా చర్చి సభ్యులు వంద మంది జపమాల నిర్వహిస్తూ వచ్చారు. శుక్రవారం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొత్తకోటతో పాటు పలు గ్రామాల క్రీస్తు సోదరులు, మహిళలు ఏసుక్రీస్తును కీర్తిస్తూ, భక్తి పాటలు ఆలపిస్తూ ర్యాలీ చేశారు. ఏసు ప్రభువు వేషధారణ చేసిన భక్తుని భుజంపై పెద్ద శిలువ వేసి రాజభటులు ఊరేగించడం పలువురిని ఆకట్టుకుంది. కొత్తకోట బాల ఏసు విచారణ సంఘం ఫాదర్ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలు గ్రామాల చర్చి సభ్యులు పాల్గొన్నారు.



నర్సీపట్నంలోని పెదబొడ్డేపల్లిలో శాంతి ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

దేవరాపల్లిలో 24 నుంచి కరాటే శిక్షణ తరగతులు

దేవరాపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలో ఈ నెల 24 కరాటే శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు సీనియర్ కరాటే కోచ్ గెడ్డం నగేశ్ శుక్రవారం తెలిపారు. ఉషోదయ స్కూల్ ఆవరణలో ప్రతీ రోజు ఉదయం 6.30 నుంచి 7.30 వరకు ఉచితంగా ఈ శిక్షణ ఇస్తామని చెప్పారు. ఆడ పిల్లలు ఆత్మ రక్షణ కోసం కరాటే ఎంతో ఉపయోగపడుతుందని, ఇక్కడ తర్ఫీదు పొందిన విద్యార్థులను రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చదిద్దడమే లక్ష్యమని చెప్పారు. ఆసక్తి గల వారు 9542293555, 9182856530 ఫోన్ నంబర్లుకు సంప్రదించాలన్నారు.

ఉపాధి వేతన బకాయిల కోసం కూలీల నిరసన

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో పోలేపల్లి గ్రామంలో ఉపాధి పథకం కూలీలు వేతన బకాయిలు చెల్లించాలని శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌వీ.నాయుడు మాట్లాడుతూ 13 వారాలుగా వేతన బకాయిలు చెల్లించకపోతే కూలీలు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా రూ.55 కోట్లు బకాయిలు ఉన్నాయని, ఉపాధి నిధులను వివిధ అభివృద్ధి పనులకు మళ్లించి కూలీల వేతనాలు పెండింగ్ పెట్టేశారని చెప్పారు. తక్షణమే వేతన బకాయిలు చెల్లించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నరసింహులు, అప్పారావు, ప్రసాద్, శివ తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో...

కె.కోటపాడు: ఉపాధి కూలీల బకాయిలు వెంటనే చెల్లించాలని కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి యర్రా దేముడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గొండుపాలెంలో కూలీలతో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ ఈ ఏడాది కొత్త పనులకు వేతనం పెంచి ఉపాధి కూలీలు పండగ చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. మండుటెండలో పనిచేస్తున్న కూలీలకు కనీసం టెంట్ సౌకర్యం కూడా కల్పించలేని నిస్సహాయి స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. కనీస సదుపాయాలు కూడా కల్పించకుండా పనులు చేయించడం దారుణమని ఆయన వాపోయారు.

డోలీ భారం తీరేదెన్నడో..?

పశువులబందలో కనీస సదుపాయాలు కరువు

ఏడేళ్ల బాలుడ్ని డోలీపై ఆస్పత్రికి తీసుకువెళ్లిన తల్లిదండ్రులు, బంధువులు



గుట్టల మధ్యన డోలీలో బాలుడ్ని ఆస్పత్రికి తీసుకువెళ్తున్న గిరిజనులు

మాడుగుల రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తరాలు మారుతున్నా.. కొంతమంది గిరిజనుల తలరాతలు మారడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా.. వారి బతుకుల్లో మార్పులు కనపడడం లేదు. కనీస సదుపాయాలకు కూడా వారు దూరమవుతున్నారు. రహ'దారిద్రం'తో అనారోగ్యం బారినపడితే డోలీ మోతలే శరణ్యమవుతున్నాయి.

మండలంలోని అవురువాడ పంచాయతీ సామాలమ్మ కొండపైన పశువులబంద గ్రామంలో ఏడు గిరిజన కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వారికి అత్యవసర చికిత్సకు కనీసం ఆశా కార్యకర్త కూడా లేరు. అనారోగ్యం బారిన పడితే డోలీ మోతలతో కాలినడక ఆస్పత్రికి వెళ్లాల్సిన దుస్థితి. ఈ తరుణంలో గ్రామానికి చెందిన సేదరి కొండలరావు అనే ఏడేళ్ల బాలుడు రెండు వారాలుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఎంతకీ జ్వరం తగ్గకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితిలో తల్లిదండ్రులు శుక్రవారం ఉదయం 8 గంటలకు పశువులబంద గ్రామం నుంచి డోలీ కట్టి కాలినడకన బయలుదేరారు. రావికమతం మండలం తానిమానుచెట్టు వరకు సుమారు ఏడు కిలోమీటర్లు డోలీ మోతతో తీసుకు వచ్చారు. అక్కడ నుంచి ద్విచక్ర వాహనంపై కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకు వెళ్లి వైద్యం చేయించారు. ఇలాంటి దుర్భర స్థితిలో జీవనం సాగిస్తున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీరు, రోడ్డు సదుపాయాలు కల్పించాలి

తాగునీరు, రోడ్డు లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారని ఆదివాసీ గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ ప్రతినిధులు నరసింహమూర్తి, కె.గోవిందరావు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటికి కోసం కాలువ, ఊట నీటిపై ఆధారపడుతున్నారని, అధికారులకు సమస్య తెలిపినా పట్టించుకోవడం లేదని వాపోయారు. కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే పశువులబంద గ్రామం నుంచి పది కిలోమీటర్లు దూరం ప్రయాణం సాగించాలని, దీంతో కొత్తకోట పీహెచ్‌సీపై ఆధారపడుతున్నారని వారు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు.

పోక్సో కేసుపై డీఎస్పీ విచారణ



గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నాతవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవనగరం గ్రామానికి చెందిన గుడివావ హరీశ్ (27)పై నమోదైన పోక్సో కేసుపై డీఎస్పీ పి.శ్రీనివాసరావు శుక్రవారం విచారణ చేపట్టారు. హరీశ్ ప్రేమ పేరుతో తనను వంచించాడని, ఇప్పుడు వేరే మహిళతో పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడ్డాడని ఓ యువతి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ సిహెచ్.భీమరాజుతో కలిసి మాధవనగరం వెళ్లి డీఎస్పీ దర్యాప్తు నిర్వహించారు. ఇందకు ముందే యువతిని వివాహం చేసుకోవాలని సూచించామని, అందుకు హరీశ్ కూడా అంగీకరించి ఇప్పుడు వేరే మహిళతో పెళ్లికి సిద్ధమయ్యాడని గ్రామ పెద్దలు పోలీసులకు చెప్పారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, మోసం చేసినా కఠిన శిక్షలు తప్పవని ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. అనంతరం నాతవరంలోని ఓ దుకాణంలో సిలిండర్ల కండిషన్‌ను డీఎస్పీ పరిశీలించారు. మందుగుండు సామాన్ల నిల్వ సామర్థ్యం 6.5 టన్నుల ఉండగా, ప్రస్తుతం గోదాములో 2.1 టన్నుల సామాన్లు ఉన్నాయనిడీఎస్పీ చెప్పారు. నిబంధనలకు కట్టుబడి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

గిరిజన ప్రాంతంలో లింకు రోడ్లు కావాలి

గొలుగొండ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర 16వ ప్లానింగ్ కమిషన్ చైర్మన్ సభ్యుల సమావేశంలో ఉమ్మడి విశాఖ జిల్లాల సమస్యలపై చర్చించామని జడ్పీటీసీ సభ్యుడు సుర్ల వెంకటగిరిబాబు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని తొమ్మిది మంది సర్పంచులు, ఐదుగురు ఎంపీపీలు, నలుగురు జడ్పీటీసీ సభ్యులను రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా గ్రామీణ స్థాయిలో స్థానిక సంస్థలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, నిధుల అవసరాలు, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో లింకు రోడ్లపై చర్చించామని, ప్రధానంగా గిరిజన ప్రాంతాల్లో లింకు రోడ్లు అవసరమని కోరామని ఆయన చెప్పారు.


గ్యాస్ గోదాములో ప్రమాదాలపై అవగాహన

నర్సీపట్నం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా శుక్రవారం గ్యాస్ గోదాము వద్ద సిబ్బందికి అగ్నిమాపక అధికారి అప్పలస్వామి అవగాహన కల్పించారు. ఎల్‌పీజీ గ్యాస్ గోదాములో అగ్ని ప్రమాదాలు జరగకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గోదాములో ప్రమాదాలు జరగకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై డెమో ఇచ్చారు. గ్యాస్ గోదాములో పని చేసే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆయన సూచించారు.

చోడవరంలో...

చోడవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్ సిలిండర్లు నిల్వ ఉంచే ప్రదేశంలో సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ రామస్వామి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా లక్కవరం గ్రామంలోని వంటగ్యాస్ గోదాము వద్ద సిబ్బందికి ప్రమాదాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గోదాము వద్ద సిబ్బంది పాటించవలసిన భద్రతా చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డును కమ్మేస్తున్న పొగ



కొండలఅగ్రహారంలో రోడ్డుపై విస్తరించిన పొగ

మాకవరపాలెం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొండలఅగ్రహారం మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న చెత్తకు శుక్రవారం పంచాయతీ సిబ్బంది నిప్పు పెట్టడంతో పొగ కమ్మేసింది. దీంతో దారి కనిపించక వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులు పడ్డారు. ఆరోడ్డుకు దగ్గరలో ఉన్న ఇళ్లలోకి పొగరావడంతో చిన్న పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారని స్థానికు చెప్పారు. గ్రామంలో 'చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం' ఉన్నప్పటికీ, గ్రామంలో ఉన్న చెత్తను బయ్యవరానికి వెళ్లే దారిలో ఉన్న సర్పానదిలోని వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఉన్న చెత్తకుప్పలను వారానికోసారి నిప్పుపెట్టడంతో ఆ రోజంతా పొగ వస్తోందని స్థానికులు చెబుతున్నారు. సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తేవాలనిస్థానికులు కోరుతున్నారు.

డ్రైవర్ మృతిపై కేసు నమోదు

చీడికాడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): లారీ డ్రైవర్ మృతికి కారణమైన వాహనం యజమాని దారపు రాము, డ్రైవర్ బి.సత్యసాయిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ బి.సతీశ్ తెలిపారు. శుక్రవారం ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి.. పరవాడ మండలం గొన్నవానిపాలెం గ్రామానికి చెందిన డ్రైవర్ మట్టా అప్పారావు (49) పశ్చిమగోదావరి జిల్లా నుంచి కోళ్లఫారాలకు లారీపై తౌడు కట్టలు తీసుకువస్తున్నాడు. దిబ్బపాలెం గ్రామంలోకి లారీ వెళ్లకపోవడంతో పాఠశాల పక్కనే ఉంచాడు. గ్రామం నుంచి వస్తున్న వ్యాన్ లారీ డ్రైవర్‌ను వెనుకనుంచి ఢీకొట్టింది. దీంతో గాయపడ్డ లారీ డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శుక్రవారం వ్యాన్ యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

ప్రేమ, కరుణకు ప్రతిరూపం ఏసుక్రీస్తు

భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే.. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

చింతపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. క్రీస్తును శిలువవేసిన దినాన్ని క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేగా జరుపుకుంటారు. క్రీస్తు శిలువలోనున్న కాలం మధ్యాహ్నం 12గంటల నుంచి మూడు గంటల వరకు చర్చిల్లో ప్రార్థనలు చేశారు. చింతపల్లి, సోమరవీధి ఆదివాసీ ప్రభావిత పథం చర్చిల్లో పాస్టర్లు డి. ఈనక్, వి. సోమరాజు, యేసుక్రీస్తు ప్రార్థన మందిరం, యూసీఎం చర్చిలో రెవరెండ్ పి. డేవిడ్‌రాజు, మార్కోస్, డేగలపాలెం యేసుక్రీస్తు ప్రార్థన మందిరంలో పాస్టర్ ఎం. భూషణం, జాన్‌పీటర్ వాక్యోపదేశం చేశారు. క్రీస్తు మరణానికి చిహ్నంగా క్రైస్తవులు శిలువలను ప్రార్థన మందిరాలకు తీసుకొచ్చారు. పలుచోట్ల క్రైస్తవులు శిలువలను ప్రదర్శిస్తూ ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జెషూరున్, సభ్యురాలు దెబోరా పాల్గొన్నారు.

పాడేరులో..

పాడేరు: జిల్లా కేంద్రం పాడేరుతో సహా అన్ని ప్రాంతాల చర్చిల్లోనూ శుక్రవారం సందడి నెలకొంది. పురాతనమైన స్థానిక యూ వైసీపీ చర్చిలో పాస్టర్ దేవరాజ్ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిపారు. పాస్టర్లు దైవకృప, తిమోతి, జాన్‌పెడ్రిక్, బాబూరావు, బుచ్చయ్య, వైవై.రత్నం, ప్రేమ్‌కుమార్, డానియేలు, జాషువా, మత్స్యరాజు, దేవరాజు, యూవైసీయూ సభ్యులు స్టీఫెన్‌శ్రీనివాస్, డి.రవికుమార్, కె.సత్యారావు, ఎస్.సంజీవ్, ఓజీ ప్రకాశ్, గ్లోరియస్, రాకేశ్, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.


రాజేంద్రపాలెం యునైటెడ్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

కొయ్యూరు మండలంలో..

కొయ్యూరు: ప్రేమ, కరుణ, సేవ మూడు తత్వాలు మనసుల్లోకి ప్రవేశిస్తే ఆయా జీవితాలకు పరమార్థం ఉంటుందని ఏసుక్రీస్తు తన సందేశంలో తెలిపినట్టు క్రైస్తవ మత ప్రబోధకులు పేర్కొన్నారు. శుభ శుక్రవారం ను మండల వ్యాప్తం పలు చర్చిల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా లోక రక్షకుడైన ఏసు ప్రభువు తన ఆఖరి సందేశంగా పేర్కొన్న అంశాలను బోధించారు. ఏసుక్రీస్తు బోధించిన విషయాలను నిత్యం స్మరించుకోవాలని ఈ సందర్భంగా మత ప్రబోధకులు సూచించారు. కొయ్యూరు ఒలీవల, యునైటెడ్, తదితర చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించటంతోపాటు బైబిల్ వ్యాఖ్యోపదేశం, ఏసు శిలువపై పలికిన ఏడు మాటల ప్రత్యేకతలను వివరించారు. అనేక మంది భక్తులు సమీప చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

అరకు మండలంలో..

అరకులోయ: గుడ్‌ఫ్రైడే సందర్భంగా చర్చిల్లో ఉదయం నుంచి సాయంత్రం 3 గంటలవరకు ప్రార్థనలు జరిగాయి. సర్వలోకం పాపక్షమాణకు ఏసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను పాస్టర్లు గుర్తు చేశారు. మండల కేంద్రంలో సీబీఎం బాప్టిస్టుచర్చిలో సీబీఎం ఫీల్డ్ డైరెక్టర్ పాస్టర్ రెవె.వెయిన్‌జోసెఫ్, క్రైస్ట్‌చర్చిలో రెవె.అభిషేక్ సాల్మన్, సుంకరమెట్ట సీబీఎం చర్చిలో రెవె. బి.నిరీక్షణరావు, బోసుబెడ్డ ఆలయంలో రెవె. బాబురావు,లోతేరు సీబీఎం చర్చిలో రెవె.తిరుపతిరావు , బెంజిపూర్ లూథరన్ చర్చిలో రెవె.సంజీవ్‌కుమార్,గన్నెల, బెంజీపూర్ బొండాం కొత్తవలస బాప్టిస్టు చర్చిలలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


పాడేరులోని చర్చిలో ప్రార్థనలు జరుపుతున్న పాస్టర్లు


చింతపల్లి: డేగలపాలెంలో శిలువలను ప్రదర్శిస్తున్న క్రైస్తవులు


అరకు: మాట్లాడుతున్న సిబిఎం ఫీల్డ్ డైరెక్టర్ రెవె.వెయిన్‌జోసెఫ్

హుకుంపేటలో ర్యాలీ

హుకుంపేట; స్థానిక బెతెస్త చర్చిలో పాస్టర్ సాల్మన్ రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక విశాఖ జియోను ప్రార్థన మందిరం పాస్టర్లు శివశంర్, లాజరస్‌లు పాల్గొని సేవకులకు దేవుని వాక్యాలు బోధించారు. కేక్ కట్ చేసి గుడ్ ఫ్రైడే మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తమ చర్చి నుంచి దేవుని చిత్ర పటంతో ర్యాలీ నిర్వహించి సువార్త కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలోని ఎస్తేరు రాణి, ఇస్సాకు రాజారావు, ఫిలిప్ గంగాధర్, చార్లిస్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్వీనగర్ - పాలగెడ్డ రోడ్డు నిర్మాణానికి సహకరించాలి

చింతపల్లి ఏఎస్పీకి రోడ్డు సాధన కమిటీ వినతి


చింతపల్లి ఏఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న రోడ్డు సాధన కమిటీ సభ్యులు

సీలేరు, ఏప్రిల్ 18 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం ఆర్వీనగర్ నుంచి వై రామవరం మండలం పాలగెడ్డ వరకు గల అంత ర్రాష్ట్ర నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలంటూ శుక్రవారం చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతిమిశ్రాకు ఆర్వీనగర్ పాలగెడ్డ రోడ్డు సాధన కమిటీ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు ఏఎస్పీతో మాట్లాడుతూ ఆర్వీనగర్ నుంచి పాలగెడ్డ వరకు రహదారి అధ్వానంగా మారిందన్నారు. తె లంగాణ ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రజలతో పాటు ధారకొండ ఘా ట్ రోడ్డులోని ధారాలమ్మ ఆలయ దర్శనానికి వచ్చే భక్తులు, సీలేరు, డొంకరాయి, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాల సందర్శనకు వచ్చే పర్యాటకులు ఈ మార్గంలో ఇబ్బంది పడుతున్నారన్నారు.గత సెప్టెంబర్ 8 న వచ్చిన తుఫాన్‌ను ఈ రోడ్డు, కల్వర్టులు కొట్టుకుపోయి నెల రోజుల పాటు రాకపోకలు నిలిచి తీ వ్ర ఇబ్బంది ఎదుర్కొన్నట్టు చెప్పారు. గాలికొండ, ధారకొండ, దుప్పులవాడ,గుమ్మిరేవుల పంచాయతీల్లోని అనేక గ్రామాలకు కల్వర్టులు, రోడ్లు, పొలాలు, పశువులకు తీవ్రమైన నష్టం జరిగిందన్నారు. ఈ అధికారులు తెలిపినా సమస్యలను పరిష్కరించడలేదని వాపోయారు. దీంతో రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలకు చెందిన నాయకులతో రోడ్డు సాధన కమిటీగా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఆది వారం జరిగే ర్యాలీలో ఐదు పంచాయతీల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని రోడ్డు సాధన కమిటీ ఈ సందర్భంగా కోరింది. అలాగే, ఆదివారం ధారకొండ నుంచి తలపెట్టిన శాంతియుత ర్యాలీకి అనుమతించాలని రోడ్డు సాధన కమిటీ ఏఎస్పీని ఈ సందర్భంగా కోరారు. ఆయన ఈ అంశాన్ని సంబంధిత అధికారులు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రోడ్డు పనులు ప్రారంభమయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గాలికొండ ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు, సీలేరు మాజీ వైస్ సర్పంచ్ కారే శ్రీనివాస్, జనసేన పార్టీ మండల ఉ పాధ్యక్షుడు బత్తుల సిద్ధార్థమార్క్, గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షుడు బాకూరి కోటేశ్వరరావు, గుమ్మిరేవుల మాజీ సర్పంచ్ పూజారి బాబురావు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగుల ఉపకరణాల ఎంపిక శిబిరం

చింతపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం దివ్యాంగులకు పరికాలు పంపిణీ గుర్తింపు శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీపీ కోరాబు అనుషదేవి తెలిపారు. చింతపల్లి, కొయ్యూరు, జీకేవీధి మండలాల పరిధిలోనున్న దివ్యాంగులకు అవసరమైన చెవిటి మిషన్లు, కృత్రిమ అవయవాలు, వీల్ చైర్లు, ఎలక్ట్రిక్ వీల్ చైర్లు, ఇతర పరికరాలు అందజేయనున్నట్టు చెప్పారు. పరికరాలు అవసరమైన మూడు మండలాల దివ్యాంగులు శిబిరానికి హాజరుకావాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం దివ్యాంగులు సదరం ధ్రువీకరణ పత్రం, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో తీసుకు రావాలన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

ఆశ కార్యకర్త చాకచాక్యంతో తల్లీబిడ్డా క్షేమం


మార్గం మధ్యలో ప్రసవించిన గర్భిణీతో ఆశ వర్కర్ సుబ్బమ్మ

సీలేరు, ఏప్రిల్ 18 , (ఆంధ్రజ్యోతి): అంబులెన్స్‌లో ఆస్పత్రి తరలిస్తుండగా గర్భిణీ మార్గం మధ్యలో ప్రసవించింది. తల్లీ బిడ్డా క్షేమంగా ఉన్నారు. వివరాలివి..జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని డీ అగ్రహా రంగ్రామానికి చెందిన అల్లంకి శాంతికి నెలలు నిం డడంతో శుక్రవారం పురిటి నొప్పులు ప్రారంభమ య్యాయి. ఆ గ్రామానికి చెందిన ఆశా వర్కర్ సుబ్బమ్మ వెంటనే సీలేరు ఆసుపత్రికి సమాచారం ఇచ్చి అంబులెన్సును రప్పించారు. అయితే, డీ అ గ్రహారంనుంచి 18 కిలోమీటర్ల దూ రంలో ఉన్న సీలేరు పీహెచ్‌సీకి తరలిస్తుండగా శాంతికి మార్గం మధ్యలో నొప్పులు అధికమ య్యా యి. వెంటనే ఆశా వర్కర్ సుబ్బమ్మ అక్కడ ఉన్న వారి సహకారంతో శాంతికి డెలివరీ చేయించారు. సురక్షితంగా ఆడ బిడ్డ జన్మనించింది. అనంతరం సీలేరు ఆసుపత్రికి తరలించారు. దీంతో తల్లీ బిడ్డ సురక్షితంగా ఉన్నారు. ఆశా వర్కర్ సుబ్బమ్మ చాకచాక్యంగా వ్యవహరించి ప్రసవం చేయించడంపై పలువురు అభినందించారు.

పథకాలు ప్రజల చేరువకు కృషి


కుటుంబ సాధికార సారథులకు పార్టీ గుర్తింపు కార్డులను అందజేస్తున్న టీడీపీ నేత పూర్ణచంద్రరావు

చింతపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలపై ప్రజలకు టీడీపీ కార్యకర్తలు చైతన్యవంతులను చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. శుక్రవారం అంజలి శనివారం గ్రామంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీటవేస్తోందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పక్కా గృహాలు మంజూరు చేస్తోందన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ పథకాలను మరింత చేరువ చేసేందుకు ప్ర తి 30 మంది ఓటర్లకి ఒక కుటుంబ సాధికార సారథులను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. అనంతరం ఈ సారథులకు పార్టీ గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.మహేంద్ర, కేశ్వరరావు, వెంకటరావు, పరమేశ్వరరావు, జి. చంద్రబాబు నాయుడు, సంజీవ్, బుజ్జినాయుడు, దేముడుబాబు, ప్రభాకర్ పాల్గొన్నారు.

కారు బోల్తా...ముగ్గురికి గాయాలు


లోయలోకి బోల్తా పడిన కారు

వ ముంచ ం గి పుట్టు, ఏప్రిల్ 18 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధి బూసిపుట్టు పంచాయతీ తుడుమురాయి సమీపంలో శుక్రవారం పర్యాటకుల కారు బోల్తా పడింది. ఈ సంఘటనలో ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులందించిన వివరాలివి..విశాఖలోని గాజువాక ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకులు పెదబయలు మండలం కుంజివాడ సమీపంలోని జలపాతాన్ని చూసేందుకు కారులో బయలుదేరారు. తుడుమురాయికి వచ్చేసరికి కారు అ దుపుతప్పి లోయలోకి దూసుకుపోయి పల్టీ కొట్టింది. కారు నుజ్జయింది. స్థానికులు హుటాహుటిన ప్రమాదానికి గురైన కారు వద్దకు వెళ్లి ముగ్గురు యువకులను బయటకు తీశారు. వీరు స్వల్పగాయాలతో బయట పడడంతో ఊపిరిపీల్చుకున్నారు. కారు మరో రెండు పల్టీలు కొట్టి ఉంటే పెనుప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు.

విధులకు గైర్హాజరైన పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

వైస్ ఎంపీపీ రాజుబాబు ఆగ్రహం


తలుపులు మూసిన పెదబయలు పీహెచ్‌సీని చూపుతున్న వైస్ ఎంపీపీ రాజుబాబు

పెదబయలు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీ సిబ్బంది సమయపాలన పాటించకుండా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు వైస్ ఎంపీపీ కొర్ర రాజుబాబు ఆరోపించారు. శుక్రవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో తనకు ఆరోగ్యం బాగోలేక వైద్యం కోసం పీహెచ్‌సీకి వెళ్తే... ప్రవేశ ద్వారం తలుపులు మూసివేసి ఉన్నట్టు తెలిపారు. లోనికి వెళ్లి గదులను పరిశీలించగా ఒక్క సిబ్బంది కానరాలేదని వాపోయారు. ఆ సమయంలో విధుల్లో ఉండాల్సిన స్టాఫ్ నర్స్ రాలేదని అన్నారు. ఇలా అయితే, ఆస్పత్రికి వచ్చే రోగుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఆరు గంటల వరకు రాత్రి సమయంలో ఉండాల్సిన స్టాఫ్ నర్స్ విధులకు హాజరు కాకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై వైద్యాధికారి నిఖిల్‌ను వివరణ కోరగా... పాడేరులో కురిసిన భారీ వర్షానికి రాత్రి సమయంలో విధులకు రావాల్సిన స్టాఫ్ నర్స్ హాజరుకావడం ఆలస్యమైందని తెలిపారన్నారు. సాయంత్రం సమయంలో ఆస్పత్రి పై భాగంలోని బర్త్ వెయిటింగ్ హాల్‌ను సిబ్బంది శుభ్రపరుస్తున్నట్టు తెలిపారని రాజబాబు చెప్పారు.

వైభవంగా ముత్యాలమ్మ ఉత్సవ రాట


ఆలయంలో ఉత్సవ రాటను ప్రతిష్ఠిస్తున్న భక్తులు, కమిటీ సభ్యులు

చింతపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):ముత్యాలమ్మ ఆలయంలో భక్తులు వైభవంగా ఉత్సవ రాటను ప్రతిష్ఠించారు. గంధామవాస్యకు ముందు ఈనెల 24 నుంచి 27తేదీ వరకు అమ్మవారి జాతర నిర్వాహణకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తున్న విషయం పాఠకులకు తెలిసిందే. ఇందులో భాగంగా శుక్రవారం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు, గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు సన్నాయి మేల తాళాలతో ఉత్సవ రాటను ప్రతిష్ఠించారు. ఆనంతరం జాతర నిర్వాహణపై ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులతో చర్చించి ప్రణాళికను సిద్ధం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోరాబు అనుషదేవి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దురియా హేమంత్ కుమార్, ప్రధాన కార్యదర్శి పసుపులేటి వినాయకరావు, ఉత్సవ కమిటీ కార్యదర్శి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, వర్తక సంఘంఅధ్యక్షుడు జోగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రమణ, కమిటీ నాయకులు తాడి రమణ, అర్చకుడు జగన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కాఫీ పరిశ్రమ జిల్లాలోనే ఏర్పాటు చేయాలి

ఆదివాసీ గిరిజనసంఘం నేత బాలదేవ్



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి బాలదేవ్

అరకులోయ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అరకు ఆర్గానిక్ కాఫీ ఉత్పత్తి చేస్తున్న ఆదివాసీ జిల్లా అల్లూరి జిల్లాలో కాఫీ పొడి తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయాలని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, మండల అధ్యక్షుడు జి.చినబాబు, ఉపాధ్యక్షుడు కిల్లో జగన్నాథం డిమాండ్ చేశారు. శుక్రవారం గిరిజన సంఘ భవన్‌లో వారు మాట్లాడారు. అధిక భాగం కాఫీ గింజలు జిల్లా నుంచి ఉత్పత్తి అవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కాఫీపరిశ్రమను అనకాపల్లిలో ఏర్పాటు చేస్తున్నట్టుప్రకటించారు. ఈ నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. పంట ఉత్పత్తవుతున్న జిల్లా పరిధిలోని పాడేరు ఐటీడీఏ పరిధిలో కాఫీ పరిశ్రమ ఏర్పాటు చేస్తే ఉపయోగం ఉంటుందన్నారు. గిరిజన నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. జిల్లాలో 1.30 లక్షల మంది రైతులు 2 లక్షల ఎకరాల్లో ఏటా 15వేల మెట్రిక్ టన్నులు కాఫీ ఉత్పత్తి చేస్తున్న ఈ ప్రాంతం కాదని అనకాపల్లిలో ఏ ప్రాతిపదికన పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుందని వారు ప్రశ్నించారు. కాఫీ రైతులకు చెల్లించాల్సిన సుమారు రూ.60 కోట్లు బకాయిలు విడుదల చేయాలని, కాఫీ తోటల అభివృద్ధికి ప్రోత్సాహక నిధులు, తోటలకు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు డొంబు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ఆందోళన


గుమ్మసిరగంపుట్టులోఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ గుమ్మసిరగంపుట్టులో తాగునీటి స మస్య పరిష్కరించాలని కోరుతూ, గిరిజనసంఘం ఆధ్వర్యంలో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేత ఎం.ఎం.శ్రీను మాట్లాడుతూ గ్రామంలో ఉన్న నీటి పథకాలు సక్రమంగా పని చేయక, గ్రామస్థులు కలుషిత కూట గెడ్డనీటిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నట్టు ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామంలో తాగునీటి సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు అందించినా ఫలితం కానరావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా స్పందించకుంటే ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్


విద్యార్థినులతో సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్

చింతపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ అన్నారు. గురువారం రాత్రి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి అధ్యక్షతన 17వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం పోస్టుమెట్రిక్ వసతి గృహాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వీటిలో ఉంటూ ప్రతి రోజు కళాశాలకు హాజరుకావాలన్నారు. అధ్యాపకుల బోధనలు శ్రద్ధ వినాలని, క్రమశిక్షణతో మెలగాలన్నారు. పోటీ పరీక్షలు సిద్ధపడాలన్నారు. గ్రూప్స్, సివిల్స్ పరీక్షల్లో రాణించాలన్నారు. గ్రంథాలయంలో పుస్తకాలు, దినపత్రిలు క్రమంగా చదవాలన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు అదనపు తరగతి గదులు, ల్యాబ్‌ల కోసం కలెక్టర్ దినేశ్ కుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రూ.1.5కోట్ల నిధులను మంజూరు చేశారన్నారు. ఉపాధి పథకంలో ప్రహరీ మంజూరు చేశారన్నారు. విద్యార్థులు విద్యలో మంచి ఫలితాలు సాధిస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు సబ్ కలెక్టర్ బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసపాత్రుడు, అధ్యాపకులు లీలాపావని, పీడీ శివరామ్, గ్రంథాలయ అధికారి జగ్గత్‌రాయ్ పాల్గొన్నారు.

వర్షంతో అస్తవ్యస్తం

ఏజెన్సీలో శుక్రవారం కురిసిన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి జనజీవనాన్ని అస్తవ్యస్తమైంది. పాడేరు, చింతపల్లి, హుకుంపేట, కొయ్యూరు మండలాల్లో మధ్యాహ్నం ఏకధాటిగా వర్షం పడింది. ఈ అకాల వర్షాన్ని చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పాడేరు-అరకు, విశాఖ తదితర మార్గాల్లో రాకపోకలకు ఇబ్బంది ఎదురైంది.

- పాడేరు, కొయ్యూరు, హుకుంపేట, చింతపల్లి


పాడేరులో చెట్టు పడి నుజ్జయిన స్కూటీ


కొయ్యూరు: నడంపాలెం- పెదమాకవరం మధ్య నేల కూలిన చెట్లుతొలగిస్తున్న దృశ్యం


హుకుంపేటలో కురుస్తున్న వర్షం

చెరువులో రోడ్డును తొలగించాల్సిందే

... 5వ పేజీ తరువాయి

సర్వే చేశారు. నిబంధనలకు విరుద్ధంగా చెరువులో నుంచి రోడ్డు నిర్మించినట్టు నిర్ధారించారు. దీనివల్ల చెరువు మనుగడకు ముప్పు వాటిల్లుతుందని, ఆయకట్టుకు నీరు అందక రైతులు ఇబ్బంది పడతారని గుర్తించారు. చెరువులో నుంచి వేసిన రోడ్డును తక్షణమే తొలగించి, చెరువు గర్భాన్ని పూర్వ స్థితికి తీసుకురావాలని ఇరిగేషన్ ఏఈ డి.సూర్యనారాయణ, క్వారీ లీజుదారుడు ఏకా వీర్రాజుకు నోటీసులు జారీ చేశారు. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

... 5వ పేజీ తరువాయి

తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. ఎటువంటి అఘాయిత్యానికి పాల్పడవద్దని, వెంటనే బయలుదేరి వస్తున్నానని అతను చెప్పాడు. వెంటనే మరో స్నేహితుడితో కలసి గణపతినగర్‌కు వచ్చాడు. అప్పలనాయుడు ఇంటికి వెళ్లి అతని తల్లిని నిద్ర లేపి, విషయం చెప్పి తలుపు తీయించాడు. అయితే అప్పటికే అప్పలనాయుడు ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. వెంటనే కిందకు దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ పి.సింహాచలం శుక్రవారం ఉదయం గణపతినగర్ వెళ్లి వివరాలు సేకరించారు. అప్పలనాయుడు తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఈదురు గాలులతో వర్షం

... 5వ పేజీ తరువాయి

డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో కాలువలు పొంగి రోడ్డుపై ప్రవహించాయి. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు.

కె.కోటపాడు మండలంలోని పలు గ్రామాల్లో ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. సుమారు గంటపాటు భారీ వర్షం కురిసింది. కింతాడ పంచాయతీ గ్రామ శివారు రామచంద్రపురంలో రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికులు చెట్టును నరికివేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కాగా కూరగాయ పంటలకు గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షం పడింది. ఏఎల్‌పురంలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అనకాపల్లి పట్టణంలో శుక్రవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై సుమారు పది నిమిషాలపాటు వర్షం కురిసింది. దీంతో ఫుట్ పాత్ వ్యాపారులు ఇబ్బంది పడ్డారు.

మహా ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

ప్రకటిస్తూ కూటమి కార్పొరేటర్లు 58 మంది సంతకాలు చేసి గత నెల 21న జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌కు నోటీస్ ఇచ్చారు. సంతకాల ధ్రువీకరణ అనంతరం అవిశ్వాస తీర్మానంపై శనివారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు.

తీర్మానం నెగ్గాలంటే 74 మంది సభ్యుల మద్దతు అవసరం

మేయర్ హరివెంకటకుమారిపై అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే కూటమికి 74 మంది సభ్యుల మద్దతు అవసరం. 97 మంది కార్పొరేటర్లతోపాటు 14 మంది ఎక్స్‌అఫీషియో సభ్యులు కలుపుకుని 111 మంది ఓటుహక్కు కలిగిన సభ్యులు ఉన్నారు. టీడీపీకి 48, జనసేనకు 14, బీజేపీకి ఇద్దరు కార్పొరేటర్లు.. కూటమికి మొత్తం 64 మంది కార్పొరేటర్ల బలం ఉంది. వైసీపీకి 30 మంది, సీపీఐ, సీపీఎంకి ఒక్కొక్కరు ఉన్నారు. ఇటీవలే వైసీపీకి రాజీనామా చేసిన ఆరో వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక (మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కుమార్తె) తన వైఖరిని ఇంకా ప్రకటించలేదు. సీపీఐ, సీపీఎం కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానంపై జరిగే సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. వైసీపీ కూడా సమావేశాన్ని బహిష్కరించాలని నిర్ణయించింది. కూటమి చేతిలో ఉన్న 64 మంది కార్పొరేటర్లతోపాటు 11 మంది ఎక్స్‌అఫీషియో సభ్యులు సమావేశానికి హాజరైతే అవిశ్వాస తీర్మానం నెగ్గేందుకు అవకాశం ఉంటుంది. వీరితోపాటు ముత్తంశెట్టి ప్రియాంక కూడా హాజరయ్యే అవకాశం ఉందంటున్నారు. అయితే అవిశ్వాస తీర్మానం నెగ్గకుండా వుండేందుకు వైసీపీ నేతలు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. కూటమిలో చేరిన వైసీపీ కార్పొరేటర్లను తిరిగి తమ వైపు లాక్కోవాలని చూస్తున్నారు. ఒకరిద్దరు కార్పొరేటర్లకు భారీ నజరానా ఆశ చూపించి కౌన్సిల్ సమావేశానికి హాజరుకాకుండా చేయడం, లేదంటే కౌన్సిల్‌కు హజరైనా.. అవిశ్వాసానికి మద్దతుగా చెయ్యి ఎత్తకుండా ఉండేలా ఒప్పందం చేసుకున్నట్టు ప్రచారం జరుగుతున్నది. దీంతో కూటమి నేతలు ఒకింత ఆందోళన చెందుతున్నారు.

ప్రతిపాదనల్లోనే వడ్డాది వారధి

... 5వ పేజీ తరువాయి

భారీ వాహనాలను వేరే మార్గాల్లోకి మళ్లించాల్సి వస్తున్నది.

కాగా వడ్డాది వద్ద కూలిన వంతెన స్థానంలో సుమారు రూ.25 కోట్లతో కొత్త వంతెన నిర్మిస్తామని అప్పట్లో ఎమ్మెల్యేగా వున్న కరణం ధర్మశ్రీ చెప్పారు. అధికారులతో ప్రతిపాదనలు సైతం తయారు చేయించారు. కానీ ఆయన పదవిలో వున్నంత కాలం ప్రభుత్వం నుంచి ఆమోదం లభించలేదు. తాము అధికారంలోకి వస్తే వడ్డాది వద్ద కొత్త వంతెన నిర్మిస్తామని గత ఏడాది సాధారణ ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు హామీ ఇచ్చారు. జూన్ 17వ తేదీన ఎంపీ సీఎం రమేశ్.. చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబుతో కలిసి పాత వంతెన, కాజ్‌వేను పరిశీలించారు. కొత్త వంతెన నిర్మాణానికి తక్షణమే ప్రతిపాదనలు చేసి పంపాలని సంబంధిత అధికారులను ఎంపీ రమేశ్ ఆదేశించారు. ఇంతవరకు ఎటువంటి పురోగతి లేదు.

కాగా వడ్డాది వద్ద పెద్దేరు నదిపై కొత్త వంతెన నిర్మాణం గురించి ఆర్అండ్‌బీ ఏఈ సాయిశ్రీనివాస్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. నూతన వంతెన నిర్మాణానికి రూ.25 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపామని చెప్పారు. అనుమతులు మంజూరు కాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

బయ్యవరంలో టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ



సభ్యత్వ కార్డులు కార్యకర్తలకు అందజేస్తున్న బాబర్ తదితరులు

కశింకోట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యకర్తల సంక్షేమానికి ప్రవేశ పెట్టిన సభ్యత్వ నమోదు కార్డులను శుక్రవారం బయ్యవరంలో పంపిణీ చేశారు. జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్కే బాబర్ వందమంది పార్టీ శ్రేణులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ కార్డు ఉండడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగి కార్యకర్త మరణిస్తే, ఆతని కుటుంబానికి రూ.ఐదు లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. అలాగే వారి కుటుంబానికి రూ2,50,000లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు శీరం వెంకటలక్ష్మి, నాయకులు గుమ్మాల మాణిక్యం, చోడే సూర్యఅప్పారావు, బరుకు గంగరాజు, ఎస్. గోవింద, కెల్లం పల్లి శ్రీనివాస్, గొల్లవిల్లి భవానీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు ఆర్డినెన్స్‌పై ఎమ్మార్పీఎస్ హర్షం



సంబరాలు జరుపుకుంటున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు

సబ్బవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్య, వైద్యం, ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడం పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఇక్కడ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యలక మల్లిబాబు మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం ఫలించిందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం చిత్తశుద్ధితో పనిచేసిన ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడుగా పేర్కొన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇండుగుబిల్లి గోపి, కొల్లి చిన్నఅప్పారావు, మంగరాజు, వెంకటరావు, చినరాజు, రాజబాబు, సతీశ్, చెవ్వేటి అప్పారావు, రమేశ్, అప్పారావు, రాగూర్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ



కాలనీవాసులతో మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణుస్వరూప్

పరవాడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరవాడ డీఎస్పీ వల్లెం విష్ణుస్వరూప్ సూచించారు. శుక్రవారం రాత్రి ఆయన సిబ్బందితో కలిసి స్థానిక జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు దొంగతనాల తీరుపై అవగాహన కల్పించారు. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు విలువైన వస్తువులను ఇంట్లో ఉంచరాదన్నారు. అపరిచిత వ్యక్తులు కంట పడితే తక్షణమే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. గంజాయి విక్రయాలు జరుగుతున్నట్టు దృష్టికి వస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. కాలనీలో అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎస్ఐ బి.రామారావు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత



బాలుడ్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో శుక్రవారం తప్పిపోయిన బాలుడ్ని పోలీసులు వెతికి కుటుంబ సభ్యులకు అప్పగించారు. స్థానిక బాలాజీరావుపేటకు చెందిన బాదంపూడి నాగభరత్ ఉదయం తొమ్మిదిన్నర గంటల సమయంలో ఆటలు ఆడుకోవడానికి వెళ్లి తప్పిపోయినట్లు కుటుంబ సభ్యులు 112 నంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది విచారణలో భాగంగా బాలుడ్ని ఎన్టీఆర్ స్టేడియం వద్ద గుర్తించి, సాయంత్రం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



పెట్రోల్ బంక్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న అగ్నిమాపక అధికారులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆ శాఖ అధికారులు, సిబ్బంది పలుచోట్ల అవగాహన సదస్సులు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలను వివరించారు. అనంతరం ఇందుకు సంబంధించిన కరపత్రాలను గ్యాస్, పెట్రోల్ బంకుల్లో పనిచేసే కార్మికులకు అందజేశారు. అగ్నిమాపక అధికారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

లంకెలపాలెం మాజీ సర్పంచ్ మృతి



నరసింహం (ఫైల్)

లంకెలపాలెం, ఏప్రిల్ 18 : జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం మాజీ సర్పంచ్ యలమర్తి వెంకట నరసింహం (పెదబాబు) (96) శుక్రవారం మృతి చెందారు. వృద్ధాప్యం కారణంగా గత కొన్ని రోజులుగా ఆయన ఇంటికే పరిమితమయ్యారు. రాజకీయంగా ఎన్నో పదవులు చేపట్టారు. 30 ఏళ్ల పాటు సర్పంచ్‌గా కొనసాగారు. అలాగే సబ్బవరం సమితి కార్యదర్శిగా సేవలందించారు. వాసవీ క్లబ్, రోటరీ క్లబ్, ఆర్యవైశ్య సంఘంలో వివిధ హోదాల్లో పనిచేసి ప్రజలకు సేవలందించారు. పరవాడ, సబ్బవరం, గాజువాక, అనకాపల్లి మండలాలకు చెందిన పలువురు నేతలు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యం

▸▸ కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా ▸▸ ఫార్మాసిటీ, సెజ్ పరిశ్రమల ప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, హాజరైన పరిశ్రమల ప్రతినిధులు, అధికారులు

పరవాడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. పరవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఫార్మాసిటీ, సెజ్ పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు, అధికారులతో పారిశ్రామిక భద్రతపై శుక్రవారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. గతంలో జరిగిన ప్రమాదాల నుంచి పాఠాలు నేర్చుకొని భవిష్యత్తులో పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భద్రతపై కార్మికులకు అవగాహన పెంచేందుకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతంగా పనిచేసే వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా మాట్లాడుతూ భద్రతా ప్రమాణాలు పాటించడం యాజమాన్యాల బాధ్యత అన్నారు. ప్రమాదాలు జరగకుండా భద్రతను మెరుగుపరుచుకోవాలని సూచించారు. పరవాడ డీఎస్పీ వల్లెం విష్ణుస్వరూప్, జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్‌రెడ్డి, బాయిలర్ ఇన్‌స్పెక్టర్ కె.వీరభద్రరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ముకుందరావు, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి ఆర్.వి.రమణ, డ్రగ్ ఇన్ స్పెక్టర్ వి.అభిప్రియా, కార్మికశాఖాధికారి కె.వసంతరావు, పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి సీఐలు ఆర్. మల్లికార్జునరావు, ఎన్.గణేశ్, సీహెచ్. నరసింహరావు, ఎస్ఐలు కృష్ణారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేయండి

▸▸ గొర్లెవానిపాలెంలో టీడీపీ కార్యాలయ ప్రారంభోత్సవంలో విశాఖ ఎంపీ భరత్



టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ భరత్, చిత్రంలో తాతయ్యబాబు, గండి బాబ్జీ తదితరులు

పరవాడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగు దేశం పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని విశాఖ పార్లమెంటు సభ్యుడు ఎం.భరత్ పిలుపునిచ్చారు. మండలంలోని గొర్లెవానిపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. పార్టీ శ్రేణులంతా ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు. స్థానిక ఇన్‌చార్జి దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, నార్త్ నియోజకవర్గం ఇన్‌చార్జి వెల్లంకి భరత్, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, గండి దేముడుబాబు, కాళ్ల వరలక్ష్మి, జడ్పీటీసీ మాజీ రెడ్డి నారాయణరావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వియ్యపు చిన్న, ఇందల కొండలరావు, బొండా సన్నిదేముడు, గొర్లె కనకారావు, కన్నూరు దేవి, పైలా వరలక్ష్మి, కూండ్రపు శ్రీరామ్మూర్తి, పైలా రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



గవరపేట వీధి చర్చిలో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు

అనకాపల్లి టౌన్/ కశింకోట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : గుడ్ ఫ్రైడేను క్రైస్తవులంతా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందులో భాగంగా అనకాపల్లి రింగురోడ్డు జంక్షన్ నుంచి ఏసుక్రీస్తు వేషధారణలో ఉన్న వ్యక్తి శిలువ మోస్తూ ఉండగా, అతని వెంట క్రైస్తవులు పూజలు చేస్తూ ర్యాలీగా ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో పునీత పౌలు కథోలిక దేవాలయం రెవరెండ్ ఫాదర్ ఎస్.శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, కశింకోటలోని గవరపేటలో గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాస్టర్ మూర్తి జేమ్స్ పాల్గొని ఏసు శిలువపై కలిపిన ఏడు మాటలను వివరించారు. ముందుగా చర్చిలో ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియంలో ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



స్టేడియంలోని వేదికపై కోలాటం ఆడుతున్న చిన్నారులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరలో భాగంగా ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తొలుత పట్టణానికి చెందిన ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కోలాటాలు, మ్యూజిక్ డ్యాన్స్, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తిమ్మాపాత్రుని చక్రవర్తి, సకల గోవిందరావు, గండేపల్లి మురళీ, నూకాంబిక ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, గవర కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, అమ్మవారికి అర్చకులు తొలుత విశేష పూజలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిలోని కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్ వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఇందుకు సంబంధించి పట్టణ ట్రాఫిక్ సీఐ ఎం. వెంకటనారాయణ తెలిపిన వివరాలివి. అచ్యుతాపురం మండలం మోసయ్యపేటకు చెందిన అడ్లబోయిన సత్యవతి (64) కొత్తూరులోని అన్నదమ్ముల ఇంటికి శుక్రవారం బల్దేరింది.. కొత్తూరు ఏఎంఏఎల్ కాలేజీ జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా తమిళనాడు నుంచి ఒడిశాకు రబ్బర్ లోడుతో వెళ్తున్న వ్యాన్ బలంగా ఢీకొంది. దీంతో ఆమె తీవ్ర గాయాలకు గురికాగా, ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అయితే ఆమె అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు మృతురాలి సోదరుడు గొలుసు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం తెలిపారు.

నేడు 20 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరంలోని- 1, 2 సెక్షన్ల పరిధిలో గల సబ్ స్టేషన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఇరవై గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ ఒక ప్రకట నలో తెలిపారు. ఈ కారణంగా ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గం టల వరకు సబ్బవరం, తవ్వవానిపాలెం, అమృతపురం, గొలలపాలెం, పైడివాడ, అస కపల్లి, ఇరువాడ, గొటివాడ, ఆరిపాక, అంత కాపల్లి, అసకపల్లి, గుల్లేపల్లి, మొగలిపురం, మలునాయుడుపాలెం, అయ్యన్నపాలెం, బంగారమ్మపాలెం, నాయనమ్మపాలెం, ఎల్లుప్పి, వంగలి, గాలిభీమవరం, అద్దూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. ఇందుకు వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి!

కొత్తూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కొత్తూరులోని దళిత బహుజన (డీబీ) కాలనీలో ఉన్న స్వీటు తయారీ కేంద్రంలో ఒక వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్టు శుక్రవారం తెలిసింది. మృతుడు అనకాపల్లి గవరపాలెం ప్రాంతానికి చెందిన వ్యక్తిగా స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంపై అనకాపల్లి పట్టణ పోలీసులను సంప్రదించగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

బాణసంచా తయారీ, నిల్వ కేంద్రాల్లో తనిఖీలు



మామిడిపాలెం శివారున ఉన్న పేలుడు పదార్థాల నిల్వ కేంద్రం వద్ద రికార్డును పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణి

కొత్తూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం మామిడిపాలెం శివారున ఉన్న పేలుడు పదార్థాల నిల్వ కేంద్రాన్ని డీఎస్పీ ఎం.శ్రావణి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోడౌన్ నిర్వహణలో తీసుకుంటున్న జాగ్రత్తలను పరిశీలించారు. పరిమితికి మించి స్టాకును ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవన్నారు. క్వారీల్లో పేలుడు పదార్థాలు వాడేటప్పుడు లైసెన్సు కలిగిన సిబ్బందిని మాత్రమే పంపాలని సూచించారు. క్వారీలో నిబంధనలకు నిబంధనలకు విరుద్ధంగా జెలిటన్ స్టిక్స్‌ను వాడవద్దని స్పష్టం చేశారు. అనంతరం నిల్వల కేంద్రాల యజమానులు దిగుమతి చేసుకుంటున్న పేలుడు పదార్థాలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట అనకాపల్లి రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్, ఎస్ఐ జి.రవికుమార్ ఉన్నారు.

సబ్బవరం : జిల్లాలోని కోటవురట్ల మండలం కైలాసపట్నంలో జరిగిన విస్ఫోటనం నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏడుగురు అధికారుల బృందం శుక్రవారం మండలంలోని నాలుగు బాణసంచా తయారీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. బృందంలో ఉన్న తహసీల్దార్ బిచిన్నకృష్ణ, సీఐ సిఐ పిన్నింటి రమణ, అగ్నిమాపక శాఖాధికారి సత్యరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరణి, ఈవోపీఆర్‌డీ విష్ణుమూర్తి, లేబర్ ఆఫీసర్ పి.సూర్యనారాయణ, లీగల్ మెట్రాలజీ అధికారి ఆర్.ధనుంజయ్‌లు శాఖల వారీగా బాణసంచా తయారీ కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని గుల్లేపల్లి, మలునాయుడుపాలెం, రావలమ్మపాలెం, గంగవరం గ్రామాల్లోని బాణసంచా తయారీ కేంద్రాలను తనిఖీ చేసినట్టు చెప్పారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు శనివారం పూర్తి సమాచారంతో నివేదికను అందజేయనున్నామని వివరించారు.



అంతకాపల్లిలో బాణసంచా తయారీ కేంద్రంలో అధికారుల బృందం

ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలు

▸▸ నేటి నుంచి ఆన్‌లైన్ వివరాల నమోదు

▸▸ డీఈవో అప్పారావునాయుడు

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు శుక్రవారం కోరారు. ఈ నెల 19వ తేదీ నుంచి 26వ తేదీలోగా నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌తో పాటు గ్రామ, వార్డు సచివాలయాలు, మండల వనరుల కేంద్రాల ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు 95507 87454 నంబరులో సంప్రదించాల్సిందిగా సూచించారు.

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు గ్లోబల్ స్కూల్ విద్యార్థి



ఎన్.ఎం. హరన్

పరవాడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో ఈ నెల 30న జరగనున్న జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు పి.బోనంగి సాంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థి ఎన్.ఎం.హరన్ ఎంపికయ్యాడు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించడంతో జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడని పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ మధుబాబు తెలిపారు. శుక్రవారం ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అతనిని ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, స్కూల్ చైర్మన్ పి.సూర్యనారాయణరెడ్డి, సీఈవో నిశాంత్ తదితరులు అభినందించారు.

పది మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని తుమ్మపాలలో ఓ వ్యక్తి నుంచి గురువారం రాత్రి పది మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టుఎస్ఐ డి.ఈశ్వరరావు శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం కొర్లాం గ్రామానికి చెందిన జుత్తు సీతారాం తుమ్మపాలలో నివాసం ఉంటున్నాడన్నారు. గురువారం రాత్రి మద్యం దుకాణంలో బాటిళ్లు కొనుగోలు చేసి వెళ్తుండగా అనుమానం వచ్చి హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు తనిఖీ చేశారన్నారు. ఆయన వద్ద నుంచి పది మద్యం బాటిళ్లు లభ్యం కావడంతో కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

డిపో ఎదుట ఆర్టీసీ కార్మికుల నిరసన

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఎన్ఎంయూఏ ఆధ్వ ర్యంలో పలువురు కార్మికులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని, గత నాలుగేళ్లుగా నిలిచిపోయిన పదోన్నతులను వెంటనే కల్పించాలని, ఉద్యోగులకు అనారోగ్య సెలవులు పెడితే పూర్తి జీతం చెల్లించాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను గుర్తించాలని నినాదాలు చేశారు. అసోసియేషన్ డిపో అధ్యక్షుడు ఏఎన్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జి.శంకర రావు, పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

అనధికార పార్కింగ్‌తో అవస్థలు



రహదారికి ఇరువైపులా వాహనాల పార్కింగ్

పరవాడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ కూడలిలో అనధికార పార్కింగ్‌తో అవస్థలు తప్పడం లేదు. ఫార్మాసిటీ, లంకెలపాలెం వెళ్లే మార్గంలో గల రహదారికి ఇరువైపులా భారీ వాహనాలను నిలుపుతున్నారు. ఆ మార్గం నిత్యం అచ్యుతాపురం సెజ్, ఫార్మాసిటీ, సింహాద్రి ఎన్టీపీసీ, లంకెలపాలేనికి వెళ్లే భారీ తదితర వాహనాలతో పాటు కార్మికులు, ఉద్యోగులతో రద్దీగా ఉంటుంది. ఇటువంటి రహదారిలో భారీ వాహనాలను ఇష్టానుసారం పార్కింగ్ చేస్తుండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించుకోవడానికి ఇబ్బందిగా మారింది. ఈ కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.